

సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. సహకార సంఘాలను బలోపేతం చేసి రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు తదితర సేవలను సకాలంలో అందిస్తోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి భిన్నంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 06.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 106 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ప్రపంచ స్థాయి విద్యావ్యవస్థ దిశగా ఆంధ్రప్రదేశ్



- వైఫల్యాలను విజయానికి సోపానాలుగా మలుచుకోండి
- విద్య అంటే వ్యక్తిత్వ వికాసం, సమాజ సేవకు మార్గమని అమృత స్నాతకోత్సవంలో మంత్రి నారా లోకేష్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంత వేగంగా మారుతున్న తరుణంలో మీరు మీ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. కృత్రిమ మేధస్సు, క్వాంటం ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఇన్నొవేషన్స్ ప్రతిరోజూ కొత్త అవకాశాలను సృష్టిస్తున్నాయి. యువత భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకునేలా సిద్ధం చేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లో మేము విద్యా విధానాన్ని సమూలంగా మారుస్తున్నామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అమరావతిలోని అమృత యూనివర్సిటీ స్నాతకోత్సవానికి భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరుకాగా, మంత్రి నారా లోకేష్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మేము విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలను మరింత దగ్గర చేస్తున్నాం. ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్నాం, పరిశ్రమలతో భాగస్వామ్యాలను బలోపేతం చేస్తున్నాం. యువత నేర్చుకోవడానికి, కొత్తవాటిని సృష్టించడానికి, నాయకత్వం వహించడానికి అవకాశాలను కల్పిస్తున్నామని అన్నారు.

**యువత ఉద్యోగార్థులు మిగిలిపోకూడదు :** మా లక్ష్యం చాలా స్పష్టమైనది. యువత కేవలం ఉద్యోగ అన్వేషకులుగా మాత్రమే మిగిలిపోవాలని మేము కోరుకోవడం లేదు. వారు ఉద్యోగ సృష్టికర్తలుగా మారాలని మేము ఆశిస్తున్నాం. పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలు, పరిశోధకులు, నాయకులుగా ఎదగాలని కోరుకుంటున్నాం. భవిష్యత్తులో ప్రజలు కేవలం మీ విజయాలను చూసి మాత్రమే గుర్తుంచుకోకూడదు. మీరు సమాజంలో తీసుకువచ్చిన మార్పు లేదా మీరు చేసిన కృషిని చూసి వారు మిమ్మల్ని గుర్తుంచుకోవాలని నేను కోరుకుంటున్నాను. అటువంటి గొప్ప ముద్రను వదిలివెళ్లడమే నిజమైన వారసత్వం. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అత్యంత ఉత్సాహభరితమైన కాలంలో మీరు మీ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్నారు. యువత గతంలో ఎన్నడూ లేనంత గొప్పగా కలలు కనేలా ఆంధ్రప్రదేశ్ నేడు ఒక వ్యవస్థను నిర్మిస్తోంది. మేము ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, పరిశోధకులు, భవిష్యత్తు నాయకుల కోసం అనేక అవకాశాలను కల్పిస్తున్నాం.

మిగతా 2లో...







## న్యాయవాదుల రక్షణ బిల్లుకు గ్రీన్‌సిగ్నల్

- ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్--2026 ముసాయిదా రూపొందించాలని ఆదేశాలు
- న్యాయ కార్యదర్శికి సూచనలు చేసిన మంత్రి ఎన్ఎండీ ఫరూక్

మిగతా 2లో...



## రాయలసీమ దాహార్తికి శ్రీశైలం నీరు

- హంద్రీనీవాకు 13 టీఎంసీలు.. పోతిరెడ్డిపాడుకు 10 టీఎంసీలు
- తాగునీటికే తొలి ప్రాధాన్యమన్న మంత్రి నిమ్మల

మిగతా 2లో...



## రూ.2,500 కోట్ల రహదారి పనులకు వేగం



- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి
- ఆర్అండ్‌బీ శాఖ పురోగతిపై అధికారులతో సమీక్ష
- 'వాచ్ ఏపీ రైజ్' యూట్యూబ్ ఛానల్ ప్రారంభం

మిగతా 2లో...

## క్రీడాకారులకు స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్



- భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదికగా పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ
- ఏపీ స్పోర్ట్స్ విజన్ సాకారంలో సింధు సహకారం కావాలి
- అకాడమీ భూమిపూజ కార్యక్రమంలో మంత్రి లోకేష్

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** వేలాదిమంది భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదికగా పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ నిలుస్తుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖలో పీవీ సింధు స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణ పనులకు భూమిపూజ అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి లోకేష్ మాట్లాడారు.

**భారతదేశపు గొప్ప క్రీడాకారిణిగా పీవీ సింధు గుర్తింపు పొందారు :** ఎన్నో సంవత్సరాల క్రితం భారత జట్టు జెర్సీ ధరించాలని కలలు కన్న ఒక చిన్నారి ఉండేది. ప్రతి ఉదయం హైదరాబాద్ నగరం ఇంకా నిద్రలోనే ఉండగా... ఆమె అప్పటికే కోర్టులో సాధన ప్రారంభించేది. సాధన చేసేది. పాఠశాలకు వెళ్లేది. తిరిగొచ్చి మళ్లీ సాధన చేసేది. అప్పుడు కెమెరాలు లేవు, వార్తల్లో ఆమె పేరు లేదు, పతకాలు కూడా లేవు. ఉన్నది ఒక్కటే... క్రమశిక్షణ, త్యాగం. నిన్నటి కంటే ఈ రోజు మరింత మెరుగ్గా మారాలనే అచంచల సంకల్పం. ఈ రోజు ప్రపంచమంతా ఆమెను ఒలింపిక్ పతక విజేతగా, ప్రపంచ ఛాంపియన్‌గా, భారతదేశపు అత్యంత గొప్ప క్రీడా దిగ్గజాల్లో ఒకరిగా గుర్తిస్తోంది. మనం గర్వంగా ఆమెను మన సోదరి పీవీ సింధు అని పిలుస్తున్నాం.

**పీవీ తల్లిదండ్రుల త్యాగం ఎనలేనిది :** ప్రజలు పతకాన్ని చూస్తారు. కానీ ఆ పతకం వెనుక ఉన్న ప్రయాణాన్ని ఎప్పుడూ చూడరు. ప్రతి ఛాంపియన్ వెనుక ఎదురు చూసిన ఒక తల్లి ఉంటుంది. నమ్మకం కోల్పోని ఒక తండ్రి ఉంటారు. ఎప్పుడూ వెనుకంజ వేయని ఒక కోచ్ ఉంటారు. ఈ రోజు పీవీ రమణ గారికి, శ్రీమతి పి. విజయ గారికి నా హృదయపూర్వక వందనాలు తెలియజేస్తున్నాను.

మిగతా 3లో...

## స్వయం ఏపీ ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ

- ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసిన 65 ఉత్పత్తుల మార్కెటింగ్‌పై సమీక్ష
- డీపీఆర్ యాప్‌ను స్త్రీనిధితో అనుసంధానానికి చర్యలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** స్వయం ఏపీ బ్రాండ్ కింద ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసిన 65 ఉత్పత్తులను మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలు పరిశీలిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు,

మిగతా 2లో...

## ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే... 'అభివృద్ధే అజెండా'

- విశాఖ ఎకనామిక్ రీజియన్ సమగ్రాభివృద్ధికి మైక్రో ప్లానింగ్
- ఈస్ట్-వెస్ట్ కనెక్టివిటీపై దృష్టి సారించడం ద్వారా విశాఖ ప్రాంత అభివృద్ధి
- విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధి ప్రణాళికల సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్రాభివృద్ధికి సూక్ష్మస్థాయి ప్రణాళికలను రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ రీజియన్ పరిధిలోని అన్ని ప్రాంతాలను, అన్ని రంగాలను పరిగణనలోకి తీసుకుంటూ పూర్తి స్థాయి అభివృద్ధి ప్రణాళిక చేయాలని సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో విశాఖ ఎకనమిక్ రీజియన్-వీఈఆర్ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం సమీక్షించారు. విశాఖ రీజియన్ పరిధిలో కొత్త ప్రాజెక్టులు..జగ్గ రీ-క్లాసిఫికేషన్, వైజాగ్ బే సిటీ, బే-సిటీ అథారిటీ ఏర్పాటు వంటి అంశాలపై సీఎం సమీక్షించారు. వీఈఆర్ పరిధిలో మొత్తంగా రూ. 9.50 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉందని అధికారులు వివరించారు.

మిగతా 2లో...

## ఆయూష్ వైద్యానికి చట్టబద్ధత... రిజిస్ట్రేషన్ తప్పనిసరి




- రాష్ట్రంలో తొలి సమగ్ర ముసాయిదా విడుదల
- ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, తప్పనిసరి తనిఖీలు
- మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ, సిద్ధ, యోగా-ప్రకృతి వైద్య సేవలు అందిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లు, పాలీక్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, ఆసుపత్రులు, వైద్య నిర్ధారణ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన నిబంధనలు తీసుకురాబోతుంది. చిన్న క్లినిక్ నుంచి 200 పడకలకు పైబడిన ఆసుపత్రి వరకు ప్రతి ఆయుష్ ప్రైవేట్ వైద్య సంస్థ నమోదు చేసుకోవడాన్ని తప్పనిసరి చేయనుంది. అర్హత లేని వ్యక్తులు నిర్వహించే నకిలీ వైద్య

మిగతా 2లో...

## మత్స్యకారులకు చారిత్రక భరోసా



- బీమా, సబ్సిడీ, భృతిలో విప్లవాత్మక నిర్ణయాలు
- మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మత్స్యకారుల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన మత్స్యకారుల బీమా పరిహారాలను పూర్తిగా చెల్లించడంతో పాటు బీమా పథకాన్ని విస్తరించడం, విద్యుత్ సబ్సిడీని పెంచడం, వేట నిషేధ కాల భృతిని గణనీయంగా పెంచి అందించడం వంటి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

మిగతా 3లో...

## 'ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్'ను ప్రారంభించిన మంత్రి లోకేష్

- ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా సెంటర్ ఏర్పాటు



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ దిగ్గజ ఐటీ సంస్థ ఐబీఎంవిశాఖపట్నంలో తన నూతన ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్ నౌ సెంటర్‌ను ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ సేవలకు మద్దతుగా విశాఖ ఇసుకతోట జంక్షన్ లోని లాన్సమ్ స్క్వేర్ భవనంలో ఐబీఎం సంస్థ ఏర్పాటుచేసిన ఫ్యూచర్‌నౌ సెంటర్‌ను ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ తో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐ గవర్నెన్స్ ఇంటిలిజెన్స్, కెమికల్స్ అండ్ పెట్రోలియం ఇండస్ట్రీ ఆపరేషన్స్

మిగతా 3లో...

## 'చట్టం'తో బీసీలకు రక్షణ

- మంత్రులు సవిత, అచ్చెన్నాయుడు
- బీసీలకు మరో ఎన్నికల హామీని నెరవేర్చుతున్నాం
- బీసీ రక్షణ చట్టానికి తుదిరూపు ఇస్తున్నాం
- దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్న ఏపీ : సవిత
- బీసీలను కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠిన చర్యలు

మిగతా 3లో...



## న్యాయవాదుల రక్షణ బిల్లుకు గ్రీన్‌సిగ్నల్




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల రక్షణ బిల్లు-2026( ఏపీ అడ్వకేట్స్ ప్రొటెక్షన్ బిల్ -2026)ను రూపొందించడానికి కూటమి ప్రభుత్వం కార్యాచరణ చర్యలకు ఉపక్రమించింది.
ముసాయిదాను వీలైనంత త్వరగా తయారు చేయాలని న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవికి న్యాయ, మైనారిటీ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికార యంత్రాంగం తో యుద్ధ ప్రాతిపదికన చర్చించి ముసాయిదా రూపకల్పనకు కార్యాచరణ చేపట్టాలని న్యాయశాఖ కార్యదర్శి కి సూచన చేసినట్లు మంత్రి ఫరూక్ బుధవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ముసాయిదా బిల్లు తయారైన వెంటనే తదుపరి చర్యల కోసం రాష్ట్ర అడ్వకేట్ జనరల్ తో పాటు ఆర్థిక శాఖ రిమార్కులను పరిగణలోకి తీసుకొని బిల్లు ఆమోదం కోసం మంత్రి మండలి సమావేశం ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని మంత్రి తెలిపారు. న్యాయవాదు ల సంక్షేమానికి, రక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మరణించిన 1173 మంది న్యాయవాదుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 4 లక్షలు ప్రకారం మొత్తం రూ. 46.92 కోట్లు ఆర్థిక సాయం ను కూటమి ప్రభుత్వం విడుదల చేసిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు.

## రాయలసీమ దాహార్తికి శ్రీశైలం నీరు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో తాగునీటి భద్రతకు ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అందులో భాగంగానే రాయలసీమ ప్రాంత తాగునీటి అవసరాల దృష్ట్యా శ్రీశైలం జలాశయం నుంచి హంద్రీనీవా, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులకు నీటి విడుదల చేపడుతున్నామని పేర్కొన్నారు.
ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 119 టీఎంసీల నీరు అందుబాటులో ఉండగా, రానున్న పది రోజుల్లో మరో 100 టీఎంసీల వరకు ఇన్‌ఫ్లో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నామన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని 2027 జూన్ వరకు శ్రీశైలం జలాలను ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం భద్రపరిచే విధంగా ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని స్పష్టం చేశారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 63 శాతం వాటాలో తొలి ప్రాధాన్యత తాగునీటికే ఇస్తున్నట్లు చెప్పారు. హంద్రీనీవా పరిధిలోని రిజర్వాయర్ల తాగునీటి అవసరాల కోసం 13 టీఎంసీలు, పోతిరెడ్డిపాడు పరిధిలోని రిజర్వాయర్లకు 10 టీఎంసీల నీటిని రేపటి నుంచి విడుదల చేయనున్నామని తెలిపారు.

## రూ.2,500 కోట్ల రహదారి పనులకు వేగం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రహదారి అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, క్షేత్రస్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. విజయవాడలోని ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయంలో ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో శాఖ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ కార్యకలాపాలను ప్రజలకు చేరువ చేసే లక్ష్యంతో 'వాచ్ ఏపీ రైజ్' అధికారిక యూట్యూబ్ ఛానల్‌ను ప్రారంభించారు.
రాష్ట్రంలో మొత్తం 45,433 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రహదారులు ఉండగా, వాటిలో 10,238 కిలోమీటర్ల అభివృద్ధి అవసరముందని మంత్రి తెలిపారు. వార్షిక నిర్వహణ కార్యక్రమంలో భాగంగా 22,602 కిలోమీటర్ల గుంతల రహిత రహదారుల లక్ష్యాన్ని వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ. 2,500 కోట్ల వ్యయంతో చేపట్టిన 6,061 కిలోమీటర్ల రహదారి పనుల్లో ఇప్పటివరకు 53 శాతం మాత్రమే పూర్తయ్యాయని పేర్కొంటూ, వెనుకబడిన జిల్లాల్లో పనులను వేగవంతం చేయాలని సూచించారు. బిటుమన్ కొరతతో పనులు ఆలస్యమవుతున్న నేపథ్యంలో ధరల పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని కాంట్రాక్టర్లకు ధరల సవరణ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

## బీజేపీ జోరు... క్యూ కడుతున్న నేతలు



- **తాడిపత్రి వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరం గోకుల్ నాథ్ రెడ్డి బీజేపీలో చేరిక**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్న గోకుల్ నాథ్ రెడ్డి**
- **అనంతపురం జిల్లా రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలికిన చేరిక**

**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్):** తాడిపత్రికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెరం గోకుల్ నాథ్ రెడ్డి భారతీయ జనతా పార్టీలో చేరారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ పీవీఎన్ మాధవ్ సమక్షంలో ఆయన కాషాయ కండువా కప్పుకుని పార్టీలో చేరగా, రాష్ట్ర నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సుపరిపాలన, అవినీతి రహిత పాలనకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద ఎత్తున బీజేపీ వైపు వస్తున్నారని అన్నారు.
తాడిపత్రి ప్రాంతంలో ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగిన గోకుల్ నాథ్ రెడ్డి బీజేపీలో చేరడం ద్వారా అనంతపురం జిల్లా రాజకీయాల్లో కొత్త ఒరవడికి నాంది పలికిందని పేర్కొన్నారు. ఆయన చేరికతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని, రాబోయే రోజుల్లో మరింత మంది ప్రజా నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరనున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలు, జాతీయవాద భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని పెరం గోకుల్ నాథ్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో చేనేత సమ్మేళనం జరుగుతున్న సందర్భంలో గోకుల్ నాథ్ రెడ్డి బిజెపి లో చేరారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ స్థాయి విద్యావ్యవస్థ దిశగా ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)

**వైఫల్యాలను చూసి భయపడకండి:** ఈరోజు మీ జీవితంలో అత్యంత సంతోషకరమైన రోజు. ఈరోజు మీ ప్రయాణానికి ముగింపు కాదు. ఈరోజు ఒక కొత్త ప్రయాణానికి ఆరంభం కావాలి. వైఫల్యాన్ని చూసి ఎప్పుడూ భయపడకండి. వైఫల్యం అంటే మీరు తగినంత సమర్థులు కాదని అర్థం కాదు. ప్రయత్నించే ధైర్యం మీకు ఉందని మాత్రమే దాని అర్థం. విజయం ఎప్పటికీ ప్రయత్నం విరమించని వారి సొంతం. ప్రపంచంలో మార్పు తీసుకురాగలమనే ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగండి. చరిత్రలో ప్రతి గొప్ప మార్పు "నేనెందుకు కాకూడదు?" అనే ప్రశ్నతోనే మొదలైంది. ఈ రోజు, మీరు ఒక డిగ్రీని అందుకుంటున్నారు. కానీ అంతకంటే ముఖ్యంగా... మీరు ఒక బాధ్యతను స్వీకరిస్తున్నారు. మీ కుటుంబం, మీ సమాజం, మీ దేశం పట్ల బాధ్యత అది. ఈ డిగ్రీ కేవలం మీది మాత్రమే కాదు. మీతో కలిసి ఈ ప్రయాణాన్ని సాగించిన వారందరికీ ఇది చెందుతుంది. మీ భవిష్యత్తు కోసం మీ తల్లిదండ్రులు తమ సౌకర్యాలను త్యాగం చేశారు. ప్రతి సవాలులోనూ మీ కుటుంబం మీకు అండగా నిలిచింది. మీ ఉపాధ్యాయులు మీకు మార్గనిర్దేశం చేశారు, మిమ్మల్ని సరిదిద్దారు, మీపై నమ్మకం ఉంచారు. ఈ రోజు మీ వల్ల వారు గర్వపడుతున్నారు. అలాగే, వారి వల్లే మీరు ఈ స్థితిలో ఉన్నారు.

**విలువలతో కూడిన విద్య... అమృత ప్రత్యేకత :** నేను భారతదేశం అంతటా అనేక విశ్వవిద్యాలయాలను సందర్శించాను. ప్రతి విశ్వవిద్యాలయం జ్ఞానాన్ని అందిస్తుంది. పట్టాలను ప్రసాదిస్తుంది. కానీ కొన్ని విశ్వవిద్యాలయాలు అంతకంటే ఎక్కువే అందిస్తాయి. అటువంటి వాటిలో 'అమృత' విశ్వవిద్యాలయం ఒకటి. ఆలోచించడం, నాయకత్వం వహించడం, సేవ చేయడం




వంటివి అమృత మీకు నేర్పుతుంది. అదే ఈ విశ్వవిద్యాలయాన్ని ప్రత్యేకమైనదిగా నిలుపుతోంది. విద్య అంటే కేవలం వృత్తిపరమైన జీవితాన్ని (కెరీర్) నిర్మించుకోవడం మాత్రమే కాదని అమృత విశ్వసిస్తుంది. అది వ్యక్తిత్వ వికాసానికి సంబంధించినది. కరుణ, విలువలతో సమాజానికి సేవ చేయడానికి జ్ఞానాన్ని వినియోగించుకోవడం దీని ఉద్దేశం. ఆ అద్భుతమైన దృక్పథం పూజ్యనీయులైన 'అమ్మ' నుండి వచ్చింది. అమ్మ ఒకసారి ఇలా అన్నారు... "కరుణ అనే పదాన్ని కేవలం ఒక మాటగా కాకుండా ఆచరణాత్మక మార్గంగా మనం మలచుకోగలిగితే, ప్రపంచంలోని తొంభై శాతం మానవతాపరమైన సమస్యలను పరిష్కరించగలుగుతాము." ఎంతటి శక్తివంతమైన మాట అది. జ్ఞానం మనకు నైపుణ్యాలను ఇస్తుంది. సాంకేతికత మనకు శక్తిని ఇస్తుంది. కానీ కరుణ వాటికి ఒక పరమార్థాన్ని ఇస్తుంది.
అదే అమృత ప్రతి విద్యార్థికీ నేర్పే అత్యున్నత పాఠం.

**విద్య అంతిమ లక్ష్యం జ్ఞానాన్ని పంచడమే :** ఈ రోజు మీరు ఈ ప్రాంగణం నుండి బయటకు అడుగు పెడుతున్నప్పుడు, ఈ లోకం మీ జ+ూా గురించి గానీ, లేదా మీ బంగారు పతకాల గురించి గానీ అడగదు. "మీరు ఎలాంటి మార్పును తీసుకువచ్చారు?" అని మాత్రమే అడుగుతుంది. యువతకు మంచి వృత్తి జీవితం ముఖ్యం. విజయం ముఖ్యం. కానీ మీ జ్ఞానం మరొకరి జీవితాన్ని మెరుగుపరిచినపుడే నిజమైన విజయం. అదే విద్య యొక్క అసలైన లక్ష్యం. భారతదేశాన్ని మార్చిన వ్యక్తుల గురించి ఆలోచించినప్పుడు, మనకు డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గుర్తుకు వస్తారు. ఆయన సంపన్న కుటుంబం నుండి రాలేదు. ఆయన జీవితం సులభంగా సాగలేదు. కానీ ఆయనకు ఒక గొప్ప కల ఉండేది. తన భవిష్యత్తును నిర్ణయించే అవకాశాన్ని ఆయన ఎప్పుడూ తన పరిస్థితులకు ఇవ్వలేదు. ఆయన జీవితం మనకు ఒక సులభమైన పాఠాన్ని నేర్పుతుంది. మీరు ఎక్కడ మొదలుపెట్టారన్నది ముఖ్యం కాదు. మీరు ఎక్కడికి వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నదే ముఖ్యం.

**నైపుణ్యంపై దృష్టి సారించండి :** జీవితం తరచుగా మీకు రెండు మార్గాలను చూపిస్తుంది. ఒక మార్గం సులభంగా ఉంటుంది. మరొకటి కష్టంగా ఉంటుంది. జీవితంలో ఉన్నతస్థితికి చేరాలంటే మిమ్మల్ని సవాలు చేసే మార్గాన్ని ఎంచుకోండి. ఎందుకంటే ప్రతి గొప్ప ఆవిష్కరణ... ప్రతి గొప్ప సంస్థ... ప్రతి గొప్ప ఆవిష్కరణ... ఏదైనా భిన్నంగా చేసే ధైర్యం గల వ్యక్తితోనే మొదలయ్యాయి. మీ వృత్తి జీవితాన్ని ప్రారంభిస్తున్న తరుణంలో, మీకు ఒక సూచన చేయాలనుకుంటున్నాను. విజయం కోసం పరుగులు తీయకండి. అత్యుత్తమ నైపుణ్యం సాధించడంపై దృష్టి పెట్టండి. అప్పుడు విజయం మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తుంది. నేర్చుకోవడం ఎప్పుడూ ఆపకండి. ఈ రోజు మీరు పొందుతున్న డిగ్రీ మీ విద్యాభ్యాసానికి ముగింపు కాదు. అది కేవలం ఒక ఆరంభం మాత్రమే. ప్రపంచం ప్రతిరోజూ మారుతూనే ఉంటుంది. నిరంతరం నేర్చుకుంటూ ఉండండి. కొత్త విషయాలు తెలుసుకోవాలనే కుతూహలాన్ని కలిగి ఉండండి. వినమ్రంగా ఉండండి.

**భవిష్యత్ తరాలకు స్ఫూర్తిప్రదాతలు నిలవాలి :** ఈ రోజు మీరు ఒక డిగ్రీతో ఈ ప్రాంగణం నుండి వెళ్తున్నారు. మీరు ధైర్యంతో వెళ్తారని నేను ఆశిస్తున్నాను. గొప్పగా కలలు కనే ధైర్యం. ఎవరూ వెళ్ళని కొత్త మార్గంలో పయనించే ధైర్యం. విఫలమైనా వెరవని ధైర్యం. మళ్లీ కొత్తగా ప్రారంభించే ధైర్యం. అన్నిటికంటే ముఖ్యంగా... సమాజంలో మార్పు తీసుకువచ్చే ధైర్యం కలిగి ఉండాలని నేను కోరుకుంటున్నాను. నేటి నుండి ఇరవై ఏళ్ల తర్వాత... మీరు 'అమృత'కు తిరిగి రావాలని కోరుతున్నాను. విద్యార్థులుగా కాదు... పారిశ్రామికవేత్తలుగా, శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా, ఉపాధ్యాయులుగా, ఆవిష్కర్తలుగా, ప్రజా నాయకులుగా మీరు తిరిగి రావాలి. మీరు తిరిగి వచ్చినప్పుడు... ఇక్కడ కూర్చున్న ప్రతి విద్యార్థీ మిమ్మల్ని చూసి "నేను వారిలాగే కావాలి" అని స్ఫూర్తిపొందాలి. అదే మీ అత్యున్నత సాధన అవుతుంది. అదే మీ గొప్ప విజయం అవుతుంది. అదే మీరు వదిలి వెళ్లే గొప్ప వారసత్వం అవుతుంది. 2026 బ్యాచ్ పట్టభద్రులకు అభినందనలు. ప్రపంచం మీ కోసం వేచి ఉంది. బయటకు వెళ్ళండి... గొప్పగా కలలు కనండి. కరుణతో సేవ చేయండి. నిజాయితీతో నాయకత్వం వహించండి. ప్రపంచాన్ని మార్చే ట్రెండ్ సెట్టర్లు కావాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమృత విశ్వ విద్యాపీఠం అమృత యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ విజయేంద్ర జీ, అడ్మినిస్ట్రేటివ్ డైరక్టర్ స్వామి నిజామృతానందపురి జీ, అమరావతి క్యాంపస్ రిజిస్ట్రార్ విపిన్ నాయర్, డీన్ సికె జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే... 'అభివృద్ధే అజెండా'

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేట్ రంగం నుంచి రూ. 5.30 లక్షల కోట్ల పెట్టుబడులు, అలాగే రూ. 3.50-4 లక్షల కోట్ల మేర ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయాల్సి వస్తుందని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే గూగుల్ ఏఐ డేటా సెంటర్, ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ వంటివి విశాఖ, ఉత్తరాంధ్ర కేంద్రంగా వచ్చిన అంశాన్ని అధికారులు ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇప్పటికే విశాఖలో ఐటీ, డేటా సెంటర్ల సహా వివిధ రంగాలకు చెందిన ఎకో సిస్టం ఏర్పాటైందని..దీనికి అనుగుణంగా వీఈఆర్ డెవలప్మెంట్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని...బేసిటీ ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేపట్టేలా ప్రణాళికలను సిద్ధం చేసినట్టు అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు.

**సీఆర్ జెడ్ నిబంధనలకు అనుగుణంగా వీఈఆర్ ప్రాజెక్ట్ :** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.."వీఈఆర్ సమగ్రాభివృద్ధికి సూక్ష్మ స్థాయి ప్రణాళికలను రూపొందించాలి. శ్రీకాకుళం జిల్లాలోని మూల పేట పోర్టు మొదలుకుని... రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరి ప్రాజెక్ట్ వరకూ ప్రతి ప్రాంతం.. ప్రతి టూరిజం స్పాట్, ప్రతి రంగాన్ని అభివృద్ధి చేసేలా... పెట్టుబడులు వచ్చేలా చేయడంతోపాటు... అవసరమైన మేరకు ఎక్స్ పీరియన్స్ జోన్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి. వివిధ ప్రాజెక్టులను అనుసంధానిస్తూ వీఈఆర్ ప్రగతి సాగేలా చూడాలి. వీఈఆర్ ప్రాజెక్టులో వైజాగ్ బే సిటీది కీలకపాత్ర. ఈ ప్రాజెక్ట్ ద్వారా రీజియన్ పరిధిలో పెద్ద ఎత్తున పట్టణాభివృద్ధి పనులు జరగాలి. ఇందుకు వివిధ పథకాల నిధులను కన్వెర్జెన్స్ చేసి ఈ ప్రాజెక్టు కోసం వినియోగించాలి. అలాగే కేంద్ర నిధులను మరింతగా రాబట్టే అంశంపై దృష్టి సారించాలి. వీఈఆర్ పరిధిలో ఉన్న 6 అర్బన్ డెవలప్మెంట్ అథారిటీల్లో అద్భుతమైన అభివృద్ధి జరగాలి. ఈ ప్రాజెక్టును వినియోగించుకుని ప్రతి ప్రాంతంలోనూ మౌలిక సదుపాయాల కల్పన పూర్తి స్థాయిలో జరగాలి. స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనులు చేపట్టాలి.. ప్రాజెక్టులను రాబట్టాలి. పెట్టుబడుల సాధన ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగాలను కల్పించే దిశగా చర్యలు చేపట్టాలి. ఈ మేరకు స్థానికంగా ఉండే యువతకు స్కిల్స్ అప్ గ్రేడ్ చేయాలి. కోస్టల్ మేనేజ్మెంట్ ప్రణాళికలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలి. పరిశ్రమలు, టౌన్ షిప్ ఎకో సిస్టమ్, టూరిజం ప్రాజెక్టులను అందుబాటులోకి తీసుకురావాలి. దీంట్లో భాగంగా పీపీపీ ప్రాజెక్టులను అమల్లోకి తీసుకురావడంతోపాటు.. వాటికి వీజీఎఫ్ స్కీం అమలు చేసే అంశాలను పరిశీలించండి. జ౯ నిబంధనలకు అనుగుణంగా వీఈఆర్ ప్రాజెక్టును పూర్తి చేద్దాం. జరుగుతున్న అభివృద్ధి.. చేపడుతున్న ప్రాజెక్టులు.. వీటి వల్ల కలిగే ప్రయోజనాలు.. ఉద్యోగ-ఉపాధి అవకాశాలు వంటి అంశాలను ప్రజలకు ఎప్పటికప్పుడు చెప్పాలి. వీఈఎర్ అభివృద్ధి ప్రణాళికల్లో విద్యా సంస్థలను... యూనివర్శిటీలను కలుపుకుని వెళ్లాలి. ముఖ్యంగా ఆంధ్రా యూనివర్శిటీ సేవలను వినియోగించుకోవాలి."అని ముఖ్యమంత్రి అన్నారు.

**బే సిటీ కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ కమిటీ..:**
"బేసిటీ ప్రాజెక్ట్ అమలు కోసం ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏర్పాటు చేయాలి. అన్ని ప్రాజెక్టులను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. జీసీసీ, ఫిన్ టెక్, లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ రంగాలపై దృష్టిసారించాలి. ఈస్ట్ టూ వెస్ట్ కనెక్టివిటీపై ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల రూపకల్పన.. పెట్టుబడుల సాధన జరిగేలా ప్రణాళికలను సిద్ధం చేయండి. రోడ్-రైల్ ఇంటిగ్రేషన్ జరగాలి. కాకినాడ, విశాఖలతో పశ్చిమ భారత్ లోని వివిధ ప్రాంతాలు అనుసంధానం కావాలి.
ముఖ్యంగా 4 ఎయిర్ పోర్టులు, 3 పోర్టులు లింక్ చేస్తే అభివృద్ధి వేగంగా జరగడంతోపాటు... పెట్టుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. విశాఖలో జంతు ప్రదర్శన శాలను మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలి. అంతర్జాతీయ నగరంగా విశాఖ ఎదుగుతోంది. ఇలాంటి ప్రాంతంలో ఉన్న జంతు ప్రదర్శన శాల మంచి పర్యాటక ప్రాజెక్టు అవుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, ఆర్థిక, పరిశ్రమలు, పురపాలక, అటవీ, ఇంధన, పర్యాటక, విద్య, వైద్య శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## స్వయం ఏపీ ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.
బుధవారం మంత్రి విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో సెర్ప్ డైరెక్టర్లతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఎగుమతి చేయడం, ముడిసరుకులు దిగుమతి చేసుకునే అవకాశాలు తెలుసుకునేందుకు ఏపీఎన్ఆర్‌టీఎస్తో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.
ఎలక్ట్రిక్ వాహన నమూనాలో సౌరశక్తితో నడిచే మొబైల్ లాండ్రీ యూనిట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి, దానిని పీఎంఈజీపీ కింద ఒక సంస్థాగత వ్యాపారంగా ప్రోత్సహించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల మంది మహిళలచే వ్యాపార, సేవా మరియు పారిశ్రామిక సంస్థలను ఏర్పాటు చేసే పురోగతిపై సమీక్షించి, గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిపాదించిన "ఒక కుటుంబం -ఒక పారిశ్రామికవేత్త" దృక్పథానికి అనుగుణంగా కార్యక్రమ అమలును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.
గ్రామ పంచాయతీల్లోని ప్రధాన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి, అక్కడ లైవ్‌లీహుడ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని, గ్రామీణ మహిళలు మరియు యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందేలా చూడాలని అధికారులకు సూచించారు.
ఎన్ఆర్ఎల్ఎం కింద ఎఫ్‌పీఓ స్థాయిలో స్థాపించిన 163 కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీలు) పనితీరును సమీక్షించి, రైతులకు గరిష్ఠ ప్రయోజనం కలిగేలా అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.
ఎంఎస్ఎంఈ అభివృద్ధి చేసిన డీపీఆర్ తయారీ యాప్ను స్త్రీనిధి యాప్‌తో అనుసంధానంతో పాటు, ఎస్‌హెచ్‌జీ బ్యాంక్ లింకేజీ పురోగతిని సమీక్షించి, ఎస్‌హెచ్‌జీ సభ్యులకు సంస్థాగత రుణాలు సులభంగా, నిరంతరంగా అందేలా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని మంత్రి సూచించారు.
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు ఎస్‌హెచ్‌జీ క్యాష్ క్రెడిట్ లిమిట్ (సీసీఎల్) రుణాలపై వసూలు చేస్తున్న లోన్ ప్రాసెసింగ్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్ ఛార్జీలు, ఇన్‌స్పెక్షన్ ఛార్జీల మినహాయింపు గురించి ఎస్‌హెచ్‌జీ మహిళలకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అర్హత కలిగిన అన్ని ఎస్‌హెచ్‌జీలు ఈ మినహాయింపుల ప్రయోజనాన్ని పూర్తిగా పొందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి ఆదేశించారు.

# ఆయుష్ వైద్యానికి చట్టబద్ధత...రిజిస్ట్రేషన్ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు రోగులకు నాణ్యమైన, సురక్షితమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ నూతన ముసాయిదా నిబంధనలను రూపొందించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆయుష్ అధికారులతో లోతుగా చర్చించారు. ఈ మేరకు మంత్రి జారీచేసిన ఆదేశాల మేరకు అధికారులు ముసాయిదాపై ప్రజలు, ఆయుష్ వైద్య రంగానికి చెందిన నిపుణులు, మేధావుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు బుధవారం చర్యలు చేపట్టారు. వీటిని పరిశీలించిన అనంతరమే కొత్త నిబంధనలు జారీ చేస్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

**ఆయుష్ వైద్యానికి చట్టబద్ధత :** ఇప్పటివరకు అల్లోపతి ప్రైవేట్ వైద్య సంస్థలకు మాత్రమే వర్తిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం-2002ను ప్రభుత్వం సవరించింది. చట్టం నంబరు 18/2026 ద్వారా ఆయుష్ వైద్య విధానాలను కూడా దీని పరిధిలోకి తెస్తూ ఏప్రిల్ 10న గెజిట్ నోటిఫికేష్ విడుదల చేసింది. దీని అమలుకు 'ఆంధ్రప్రదేశ్ ఆయుష్ ప్రైవేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్, రెగ్యులేషన్) రూల్స్-2026' పేరుతో ముసాయిదా నిబంధనలను సిద్ధం చేసింది. కేరళ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్ తదితర పొరుగు రాష్ట్రాల్లో అమలవుతున్న నిబంధనలతో పాటు మిషన్ ఆయుష్ మార్గదర్శకాలను అధికారులు క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ, సిద్ధ, యోగా-ప్రకృతి వైద్య సాంకేతిక నిపుణులు, వైద్యులు, ఇతర భాగస్వాములతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. రెండు నెలల పాటు సుదీర్ఘంగా నిర్వహించిన కసరత్తు అనంతరం ఈ ముసాయిదాకు తుదిరూపం ఇచ్చారు.

**అసుపత్రుల స్థాయిని బట్టి 7 రకాలుగా వర్గీకరణ, రిజిస్ట్రేషన్లు :** ముసాయిదా పేర్కొన్న నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని అన్ని ఆయుర్వేదం, హోమియోపతి, యునానీ, సిద్ధ, యోగా-ప్రకృతి వైద్య క్లినిక్‌లు, పాలీక్లినిక్‌లు, నర్సింగ్



హోమ్‌లు, ఆసుపత్రులు, వైద్య నిర్ధారణ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. వైద్య సంస్థలు అందిస్తున్న సేవలు, పడకల సామర్థ్యం ఆధారంగా ఏడు విభాగాలుగా వర్గీకరించారు. సింగిల్ డాక్టర్ క్లినిక్‌లు, పాలీక్లినిక్‌లు, 20 పడకలలోపు ఆసుపత్రులు, 21 నుంచి 50 పడకలు, 51 నుంచి 100 పడకలు, 101 నుంచి 200 పడకలు, 200 పడకలకు పైబడిన ఆసుపత్రులు ఈ కేటగిరీల పరిధిలోకి వస్తాయి. ఒకే సంస్థలో ఒకటి కంటే ఎక్కువ రకాల వైద్య సేవలు అందిస్తుంటే ప్రతి కేటగిరీ కింద విడిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు.. 10 రోజుల్లో తనిఖీలు :** అన్ని దరఖాస్తులను క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే సమర్పించాలి. దరఖాస్తు చేసిన వెంటనే 90 రోజులపాటు చెల్లుబాటయ్యే తాత్కాలిక నమోదు ధ్రువపత్రాన్ని జారీ చేస్తారు. దరఖాస్తు అందిన పది రోజుల్లోపు ఇద్దరు వైద్య నిపుణులతో కూడిన బృందం సంబంధిత వైద్య సంస్థను తనిఖీ చేస్తుంది. ఆసుపత్రి భవనం, వైద్య పరికరాలు, వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఫార్మసీ, ప్రయోగశాల, రోగుల రికార్డులు, పారిశుద్ధ్యం, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, అత్యవసర వైద్య పరికరాలు తదితర అంశాలను పరిశీలిస్తారు. నిర్దేశించిన ప్రమాణాలన్నీ పాటించినట్లు తేలితే ఐదేళ్లపాటు చెల్లుబాటయ్యే శాశ్వత నమోదు ధ్రువపత్రాన్ని మంజూరు చేస్తారు. ఈ ధ్రువపత్రాన్ని ఆసుపత్రి లేదా క్లినిక్ రిసెప్షన్ వద్ద రోగులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలి. శాశ్వత నమోదు గడువు ముగియడానికి మూడు నెలల ముందే పునరుద్ధరణకు దరఖాస్తు చేసుకోవాలి. పునరుద్ధరణ దరఖాస్తుపై మూడు నెలల్లో అధికారులు నిర్ణయం తీసుకోకపోతే అది ఆటోమేటిగ్గా పునరుద్ధరణ జరిగేలా ముసాయిదాలో ప్రతిపాదించారు.

**తనిఖీల్లో లోపాలు గుర్తిస్తే చర్యలు.. రద్దుపై అప్పీలుకు అవకాశం :** తనిఖీల్లో లోపాలు గుర్తిస్తే ఏడు రోజుల్లో సంబంధిత సంస్థకు సమాచారం ఇస్తారు. వాటిని సరిచేసుకునేందుకు రెండు నెలల గడువు కల్పిస్తారు. నిర్ణీత సమయంలో లోపాలను సరిచేయకపోతే నమోదు రుసుములో 50 శాతం జరిమానా విధించి మరో నెల అవకాశం ఇస్తారు. అప్పటికీ ప్రమాణాలు పాటించకపోతే తాత్కాలిక నమోదును రద్దు చేస్తారు. నిబంధనలను ఉల్లంఘించినా, అర్హత లేని వ్యక్తులతో వైద్య సేవలు అందించినా, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చి అవి రుజువైనా నమోదు ధ్రువపత్రాన్ని తాత్కాలికంగా నిలిపివేయడం లేదా పూర్తిగా రద్దు చేసే అధికారం నమోదు అధికారికి ఉంటుంది. ఈ నిర్ణయంపై ఉత్తర్వులు అందిన 30 రోజుల్లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటయ్యే రాష్ట్ర అప్పీలేట్ బోర్డుకు అప్పీలు చేసుకోవచ్చు. అప్పీలు రుసుముగా రూ.5 వేలు ప్రతిపాదించారు. నకిలీ వైద్యం, అర్హత లేని వ్యక్తులు వ్యాధి నిర్ధారణ, చికిత్స పేరుతో ప్రజలను మోసం చేయడం వంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థల నిర్వాహకులు, వైద్యులు లేదా మేనేజర్లపై చట్టప్రకారం శిక్షలు విధించే అవకాశం ఉంటుంది.

**చికిత్సల ధరలు, వైద్యుల వివరాల ప్రదర్శన తప్పనిసరి :** రోగులకు అందించే వైద్య సేవలు, చికిత్సలకు వసూలు చేసే రుసుములను ప్రతి క్లినిక్, ఆసుపత్రిలో తెలుగు, ఆంగ్ల భాషల్లో స్పష్టంగా ప్రదర్శించాలి. అక్కడ పనిచేస్తున్న వైద్యుల పేర్లు, వారి రిజిస్ట్రేషన్ నంబర్లు, అందుబాటులో ఉన్న సేవలను కూడా రిసెప్షన్ వద్ద ఉంచాలి. ప్రతి ఏడాది జూన్ 1లోపు చికిత్సల ధరల జాబితాను నమోదు అధికారికి సమర్పించాలి. చికిత్స పొందిన రోగుల వైద్య రికార్డులు, జాతీయ ఆయుష్ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచారాన్ని నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం భద్రపరచాలి. వైద్య సంస్థల స్థాయి, పడకల సామర్థ్యం ఆధారంగా రిజిస్ట్రేషన్ రుసుములను ప్రతిపాదించారు. సింగిల్ డాక్టర్ క్లినిక్‌కు రూ. 3 వేల నుంచి 200 పడకలకు పైబడిన ఆసుపత్రికి రూ. 50 వేల వరకు రుసుం ఉంటుందని పేర్కొన్నారు.
ఆసుపత్రుల స్థాయిని బట్టి చికిత్స కోసం వచ్చే రోగులకు అనుగుణంగా అత్యాధునిక పరికరాలు, ల్యాబ్స్, మరుగుదొడ్లు వంటి అన్ని రకాలు సదుపాయాలు అందుబాటులో ఉంచాలి. ప్రతి ఆయుష్ వైద్య విధానానికి రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక సలహా కమిటీలను ఏర్పాటు చేస్తారు. రిజిస్ట్రేషన్లు, తనిఖీలు, ప్రమాణాల అమలు, ఫిర్యాదులపై చర్యలను ఈ కమిటీలు సమీక్షిస్తాయి. వీటి పదవీకాలం మూడేళ్లు ఉంటుంది.

**వెబ్‌సైట్‌లో ముసాయిదా :** సలహాలు, సూచనలకు కోసం ముసాయిదాను ఆయుష్ శాఖ అధికారిక వెబ్‌సైట్ ఖఎబంష్ట్ర.ఖజూ.స్త్రశీజ.అఅ లో బుధవారం నుంచి అందుబాటులో ఉంచారు. షశీఎఎతీ-ఖజూఖఎబంష్ట్రఖజూ.స్త్రశీజ.అఅ ద్వారా కూడా ప్రజలు, ఆయుష్ వైద్యులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్య సంఘాలు, నిపుణులు రెండు వారాల్లో తమ విలువైన సలహాలు, సూచనలు, అభ్యంతరాలను వెబ్‌సైట్‌లోని ప్రత్యేక లింక్ ద్వారా తెలియజేయాలని ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ వెల్లడించారు.



# అభివృద్ధి-సంక్షేమంతో ప్రజల గుండెల్లో కూటమి ప్రభుత్వం







- రెండేళ్ల పాలనకు ప్రజల మద్దతే నిదర్శనం
- ప్రతి ఇంటికీ భరోసా... ప్రతి కుటుంబానికి సంక్షేమం
- అంగలకుదురులో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పాలన సాగిస్తోందని ఎమ్మెల్సీ, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. "రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయం నుంచి నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలు, అవసరాలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా కల్పించారు.

ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూనే రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తోందన్నారు. తల్లికి వందనం, సామాజిక భద్రతా పెన్షన్ల పెంపు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఆర్థిక చేయూత, విద్యార్థులకు ప్రోత్సాహక కార్యక్రమాలు వంటి సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటోందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యం ఇవ్వడం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాలకు తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

ప్రచార కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలను నమోదు చేసి సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించే చర్యలు చేపడతామని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మత్స్యకారులకు చారిత్రక భరోసా

(మొదటి పేజీ తరువాయి)

మత్స్యకార కుటుంబాలకు మాటల్లో కాదు, చేతల్లో భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గతంలో 18 నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న సముద్ర మత్స్యకారులకు మాత్రమే పరిమితమైన బీమా పథకాన్ని ప్రస్తుతం 18 నుంచి 70 ఏళ్ల వరకు విస్తరించామని మంత్రి తెలిపారు. సముద్ర మత్స్యకారులతో పాటు లోతట్టు ప్రాంతాల్లో చేపల వేట, చేపల పెంపకం, రొయ్యల పరిశ్రమలు, ఫీడ్ పరిశ్రమలు, చెరువుల్లో పనిచేసే కార్మికులను కూడా బీమా పరిధిలోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. గతంలో చేపల వేట సమయంలో మరణించిన వారికి మాత్రమే బీమా వర్తించేదని, ప్రస్తుతం అర్హులైన మత్స్యకారులు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల బీమా ప్రయోజనం అందేలా నిబంధనలు సవరించినట్లు వెల్లడించారు.

బీమా పథకం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 2.56 కోట్లు, కేంద్ర ప్రభుత్వం రూ. 4.20 కోట్లు వెచ్చిస్తూ మొత్తం రూ. 6.76 కోట్లతో మత్స్యకార కుటుంబాలకు రక్షణ కల్పిస్తోందని అచ్చెన్నాయుడు వివరించారు. గతంలో సుమారు 1.30 లక్షల కుటుంబాలకు మాత్రమే పరిమితమైన బీమా సౌకర్యాన్ని ప్రస్తుతం సుమారు 8 లక్షల మందికి విస్తరించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మత్స్యరంగ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను సైతం అధిగమిస్తూ ఈ నిర్ణయాలు అమలు చేస్తోందన్నారు.

విద్యుత్ సబ్సిడీ విషయంలోనూ కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు మరింత అండగా నిలిచిందని మంత్రి చెప్పారు. 2023-24లో 64,735 విద్యుత్ కనెక్షన్‌లకు రూ. 724.67 కోట్ల సబ్సిడీ అందించగా, 2025-26లో 68,512 కనెక్షన్‌లకు రూ. 845 కోట్ల సబ్సిడీ అందించినట్లు తెలిపారు. 2026-27లో 71 వేల కనెక్షన్‌లకు రూ. 1,150 కోట్ల సబ్సిడీ ఇవ్వాలని ప్రతిపాదించామని పేర్కొన్నారు. జోన్-నాన్ జోన్ విధానాన్ని రద్దు చేయడం ద్వారా మరో 12,500 కొత్త విద్యుత్ కనెక్షన్‌లకు కూడా సబ్సిడీ అందే అవకాశం కల్పించామని వివరించారు.

వేట నిషేధ కాల భృతిలో కూడా ప్రభుత్వం గణనీయమైన పెంపు చేపట్టిందని అచ్చెన్నాయుడు తెలిపారు. 2023-24లో రూ. 116.61 కోట్ల భృతి పంపిణీ కాగా, 2025-26లో 1,21,433 మంది మత్స్యకారులకు రూ. 242.86 కోట్లు అందించామని చెప్పారు. 2026-27లో మరో 12,865 మందిని కొత్తగా చేర్చి మొత్తం 1,34,298 మంది మత్స్యకారులకు రూ. 268.59 కోట్ల భృతి అందించనున్నట్లు వెల్లడించారు. మత్స్యకారుల సంక్షేమంపై విమర్శలు చేసే ముందు గత ప్రభుత్వ పనితీరును పరిశీలించాలని, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై గణాంకాలతో బహిరంగ చర్చకు సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు.

## 'చట్టం'తో బీసీలకు రక్షణ

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్)** : బీసీ రక్షణ చట్టంతో వెనుబడిన వర్గాలు గౌరవ ప్రదంగా సామాజిక జీవనం కొనసాగించేలా రక్షణ కల్పిస్తున్నామని, కులం, వృత్తుల పేరుతో దూషిస్తే కఠినంగా శిక్షించేలా చట్టం రూపొందిస్తున్నామని మంత్రులు ఎస్.సవిత, అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ చట్టంపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీల అభిప్రాయాలు తీసుకున్నామని, త్వరలో జిల్లా స్థాయిలోనూ బీసీ సంఘాల ప్రతినిధుల నుంచి సలహాలు తీసుకుంటామని తెలిపారు. బీసీ ముసాయిదా రక్షణ చట్టం జాతీయ బీసీ కమిషన్ దృష్టికి తీసుకెళతామని, అక్కడ అనుమతి రాగానే అసెంబ్లీలో ఆమోదానికి ప్రవేశపెడతామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో వీలైనంత త్వరగా బీసీ రక్షణ అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్ హోటల్ లో బీసీ ముసాయిదా రక్షణ చట్టంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో బుధవారం కీలక సమావేశం జరిగింది. సమావేశ అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రులు మాట్లాడారు. ముందుగా మంత్రి సవిత సవిత మాట్లాడుతూ.. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు బీసీ రక్షణ చట్టాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొస్తోందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక గుర్తింపే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. బీసీలను వేధించినా, జాతి, కుల వృత్తుల పేరుతో దూషించినా బీసీ రక్షణ చట్టం కింద శిక్షార్హులున్నారు. బీసీ రక్షణ చట్టం కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**బీసీలను వేధించిన గత ప్రభుత్వం: మంత్రి అచ్చెన్నాయుడు** : బీసీ రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మా పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలు అండగా ఉంటూ వస్తున్నారన్నారు. వారు కుల వివక్షకు గురికాకుండా ఉండాలని భావించి బీసీ రక్షణ చట్టానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. దేశంలో ఎన్నో చట్టాలున్నా బీసీల రక్షణకు చట్టం లేదన్నారు. గత ప్రభుత్వ మధ్య పాలనలో బీసీలు తీవ్ర అన్యాయానికి గురయ్యారన్నారు. మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో బీసీలు తమ కష్టాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఆనాడే బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామని మంత్రి నారా లోకేశ్ ప్రకటించిన విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు గుర్తుచేశారు.

అంతకుముందు మంత్రి సవిత నేతృత్వంలో జరిగిన సమావేశంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. బీసీ రక్షణ చట్టం పటిష్టంగా ఉండేలా రూపొందించాలని సూచించారు.

## కూటమి ప్రభుత్వ హయాంలో వ్యవసాయ సొసైటీలకు కొత్త ఊపు

- అంగలకుదురు వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)** : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యం లభిస్తోందని, సహకార సంఘాల బలోపేతం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలోని కల్యాణ మండపంలో నిర్వహించిన అంగలకుదురు గ్రామ వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన చైర్మన్ అలపర్తి సుధాకర్ రావు, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు.

అనంతరం జరిగిన సభలో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయ రంగ అభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురైందని, ప్రస్తుతం రైతుల అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, రుణాలు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా సహకార సంఘాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

వ్యవసాయ సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తాయని, రైతులకు అవసరమైన అన్ని సేవలను ఒకే వేదికపై అందించే కేంద్రాలుగా వాటిని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నూతన పాలకవర్గంపై ఉందని ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ అన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పారదర్శకంగా పనిచేసి సంఘాన్ని ఆదర్శవంతమైన సంస్థగా తీర్చిదిద్దాలని నూతన పాలకవర్గానికి సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్మన్ అలపర్తి సుధాకర్ రావు, డైరెక్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సూర్య వెంకటరావు, నల్లబోయిన నాగేశ్వరరావు, కనగాల శ్రీనివాసరావు, పాలడుగు సురేంద్రతో పాటు పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు స్వర్గధామంగా ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)

వారు ఒలింపిక్ పతకాలు గెలవలేదు. కానీ భారతదేశానికి ఒక ఒలింపిక్ ఛాంపియన్‌ను అందించారు. అలాగే ప్రతి కోచ్‌కు కూడా నా వందనం. ఎందుకంటే ఛాంపియన్లు ఒక్క రాత్రిలో తయారు కారు. వారిని సహనం, క్రమశిక్షణ, అచంచల విశ్వాసంతో తీర్చిదిద్దుతారు.

**వేలాదిమంది భవిష్యత్ ఛాంపియన్లను తీర్చిదిద్దే వేదిక పీవీ సింధు అకాడమీ** : కొన్ని వారాల క్రితం వివిధ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించబోతున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన క్రీడాకారులందరినీ కలిసే అవకాశం నాకు లభించింది. ఆ సాయంత్రం సింధు కూడా ఎంతో ఆప్యాయంగా మాతో కలిసి విందులో పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆమె చెప్పిన ఒక మాట నా మనసులో బలంగా నిలిచిపోయింది. తాను ఇప్పుడు 19 ఏళ్ల యువ క్రీడాకారిణిని కాదని అన్నారు. ఆ మాట నన్ను ఎంతో ఆలోచింపజేసింది. ఎందుకంటే.. ఆమె లక్ష్యం ఇప్పుడు కేవలం పతకాలు గెలవడమే కాదు. తాను చేసిన ఈ ప్రయాణాన్ని, తాను పొందిన అనుభవాన్ని ఎలా ఒక వ్యవస్థగా రూపుదిద్దాలి, వాటిని తర్వాతి తరాలకు ఎలా అందించాలన్నదే ఆమె ఆలోచన. తన లెగసీని ఎలా కొనసాగించాలి, తన నుంచి ప్రేరణ పొందిన తరతరాల క్రీడాకారులు ఎదగాలంటే ఏం చేయాలనే దిశగా ఆమె ఆలోచిస్తున్నారు. ఆ స్ఫూర్తితోనే విశాఖపట్నంను క్రీడా రంగంలో ఒక గొప్ప కేంద్రంగా మార్చగలమనే విశ్వాసం ఆమెకు ఉంది. అందుకే ఈ రోజు వారందరూ మీ అందరి ముందుకు వచ్చి నిలబడ్డారు.

ఈ రోజు మనం కేవలం ఒక భవనానికి శంకుస్థాపన చేయడం లేదు. వేలాదిమంది భవిష్యత్ ఛాంపియన్ల జీవిత ప్రయాణానికి తొలి అధ్యాయాన్ని లిఖిస్తున్నాం. బహుశా తదుపరి ఒలింపిక్ ఛాంపియన్ ఇక్కడే మన మధ్య కూర్చుని ఉండవచ్చు. తాను ఒక రోజు ప్రపంచ వేదికపై నిలుస్తానని ఆ చిన్నారికే ఇంకా తెలియకపోవచ్చు. ఆ సామర్థ్యాన్ని గుర్తించే అవకాశం ఆ చిన్నారికి కల్పించడం మనందరి బాధ్యత.

**పీవీ సింధు వ్యక్తిగత కల అందరి కలగా మారింది** : ప్రపంచంలోని అగ్రశ్రేణి క్రీడా దేశాలన్నింటిలో ఒక విషయం మాత్రం కామన్ గా కనిపిస్తుంది. వారు ఛాంపియన్లు జన్మించాలని ఎదురుచూడరు. ఛాంపియన్లు తయారయ్యే వాతావరణాన్ని సృష్టిస్తారు. ఆస్ట్రేలియా ఆస్ట్రేలియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌ను నిర్మించింది. ఖతార్ ప్రపంచ ప్రఖ్యాత అస్పైర్ జోన్‌ను అభివృద్ధి చేసింది. ఇండియా ఇన్‌స్పైర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ సంస్థలు తమ దేశాలకు గర్వకారణమైన అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దాయి. ఎందుకంటే గొప్ప దేశాలకు ఒక సత్యం తెలుసు. ఒలింపిక్ పతకాలను క్రీడాకారులు గెలుస్తారు, కానీ ఒలింపిక్ కలలకు పునాది వేసేది సంస్థలే. ఈ అకాడమీ కూడా ఒక కలతోనే ప్రారంభమైంది. అది సింధు హృదయానికి ఎంతో దగ్గరైన ఒక కల. కానీ ఆ కలను ఆమె మన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారితో పంచుకున్నప్పుడు, ఆయన ఆమెను కేవలం బ్యాడ్మింటన్ మాత్రమే ఎందుకని ఒక సింపుల్ క్వశ్చన్ అడిగారు. ప్రతి క్రీడలోని పిల్లలు నేర్చుకునేలా, శిక్షణ పొందేలా, అత్యుత్తమ ప్రతిభ కనబరిచేలా ఒక కేంద్రాన్ని ఎందుకు నిర్మించకూడదని ప్రశ్నించారు. ఆ ఒక్క ప్రశ్న అన్నింటినీ మార్చేసింది. ఒక వ్యక్తిగత కల అందరి కలగా మారింది. ఒక భాగస్వామ్య దార్శనికతగా రూపుదిద్దుకుంది.

## సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ ఆధ్వర్యంలో టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ సమావేశం




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్)** : గుంటూరు సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ ఐ.ఆర్.ఎస్ అధికారి అరుణ్ రిచర్డ్ సారథ్యంలో 'టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ' , హిందీ సమావేశం బుధవారం గుంటూరు కన్నవారితోట జీఎస్టీ భవన్ లో జరిగింది. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల దైనందిన కార్యకలాపాలలో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడం మరియు అధికారులలో హిందీపై పని పరిజ్ఞానాన్ని పెంపొందించడం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు లో పనిచేస్తున్న వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన అధికారులు మరియు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత ప్రభుత్వ అధికార భాషా విధానం అమలు, అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు, పరిపాలనాపరమైన పనులు, నోటింగ్ మరియు డ్రాఫ్టింగ్ (ఫైల్స్ తయారీ)లో హిందీ వినియోగాన్ని పెంచడం, అలాగే అధికారిక హిందీలో నైపుణ్యాన్ని మెరుగుపరచుకునే ఆచరణాత్మక పద్ధతులపై సమావేశం చర్చించింది. తోలుత గుంటూరు సెంట్రల్ జీఎస్టీ ఇన్స్పెక్టర్ సునీల్ చౌదరి, అధికార భాషా చట్టం నిబంధనలు, అధికార భాషా నియమాలు మరియు అధికార భాషా విభాగం జారీ చేసిన వార్షిక కార్యక్రమంపై సమాచారయుతమైన సెషన్లను నిర్వహించారు. కార్యాలయ పనిలో హిందీ వినియోగంపై ఆచరణాత్మక ప్రదర్శనలు, పరస్పర చర్చలు జరిగాయి. దీనిలో పాల్గొన్నవారు తమ సందేహాలను నివృత్తి చేసుకోవడంతో పాటు అధికార భాషా అమలుపై తమ అవగాహనను బలోపేతం చేసుకునే అవకాశం కలిగింది.

అధికారిక వృత్తి లో హిందీ వినియోగం అనేది కేవలం అధికార భాషకు సంబంధించిన రాజ్యాంగ మరియు చట్టపరమైన నిబంధనలను నెరవేర్చడమే కాకుండా, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడానికి మరియు ప్రజలకు మరింత విస్తృతంగా చేరువ కావడానికి కూడా దోహదపడుతుందని గుంటూరు సెంట్రల్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ దేవ్ కుమార్ రజ్వాని (ఐ ఆర్ ఎస్ ) తెలిపారు. ఈ కార్యశాలను విజయవంతం చేయడంలో సంపూర్ణ సహకారం అందించినందుకు, పాల్గొన్న అన్నీ కేంద్ర కార్యాలయాల అధికారులకు సెంట్రల్ జీఎస్టీ సూపరింటెండెంట్ హెయర్ బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కేంద్ర ప్రభుత్వ అధికారులు రవీంద్రనాథ్, అశుతోష్, అమృత రాజ్, శశిదాస్, ఆనందగోపాల్, చంద్రవర్మ, నీరజ్, రవి, శ్యాంప్రకాష్, అమిత్, చక్రధర్, రాజేష్, ప్రణిత, ఫణి తదితరులు పాల్గొన్నారు.



## 'ఐబీఎం ఫ్యూచర్ నౌ సెంటర్'ను ప్రారంభించిన మంత్రి లోకేష్

(మొదటి పేజీ తరువాయి)



గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా కన్సల్టింగ్ సేవలు, ఏఐ ఫస్ట్ ట్రాన్స్ ఫర్మేషన్ ప్రాజెక్టులకు మద్దతుగా ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ను ఏర్పాటుచేయడం జరిగింది. భారతదేశ సాంకేతిక ఆవిష్కరణలు, ప్రతిభావంతులైన మానవ వనరుల అభివృద్ధిపై సంస్థ కొనసాగిస్తున్న పెట్టుబడులకు ఇది మరో కీలక ముందడుగు కానుంది. ఈ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఖాతాదారులకు కన్సల్టింగ్, సాంకేతిక సేవలను అందించనుంది. ఇందులో కృత్రిమ మేధస్సు, హైబ్రిడ్ క్లౌడ్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, డేటా ఐ అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నారు. అదేవిధంగా ఏఐ ఆధారిత క్లౌడ్ ట్రాన్స్‌ఫర్మేషన్, ప్లాట్‌ఫార్మ్ ఇంజనీరింగ్, సర్వీస్ ఇంటిగ్రేషన్, క్వాలిటీ ఇంజనీరింగ్, యూజర్ ఎక్స్‌పీరియన్స్ సేవలకు ఇది ప్రధాన కేంద్రంగా పనిచేయనుంది.

**ఫ్యూచర్ రెడీ టెక్నాలజీ వర్క్ ఫోర్స్ అభివృద్ధే లక్ష్యం** : భారతదేశంలోని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక కేంద్రాల్లో ఆవిష్కరణలు, సేవల సామర్థ్యాలను విస్తరించాలన్న ఐబీఎం లక్ష్యానికి ఈ ఫ్యూచర్‌నౌ సెంటర్ ప్రతీకగా నిలుస్తోంది. విస్తృత సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పర్యావరణ వ్యవస్థతో విశాఖపట్నం ప్రపంచ ఖాతాదారుల అవసరాలను తీర్చేందుకు అనువైన కేంద్రంగా ఎదుగుతోంది. ఈ సెంటర్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఐబీఎం తన కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన సాంకేతిక నైపుణ్యాలున్న మానవ వనరుల అభివృద్ధికి తోడ్పడాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో ఏపీ యువత భాగస్వామ్యం కావాలి** : ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ సేవలు, సాంకేతికత ఆధారిత ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా విశాఖపట్నం ఆవిర్భవించడాన్ని ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ తోడ్పాటునందిస్తోంది. మా లక్ష్యం, కేవలం సాంకేతిక పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాదు, నాణ్యమైన ఉపాధిని సృష్టించడం, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న ప్రతిభను అభివృద్ధి చేయడం, ఆంధ్రప్రదేశ్ యువత ప్రపంచ డిజిటల్ ఆర్థిక వ్యవస్థలో భాగమయ్యేలా చేసే ఒక సంపూర్ణ పర్యావరణ వ్యవస్థను నిర్మించడమే మా లక్ష్యం. ఆంధ్రప్రదేశ్ పట్ల ఐబీఎం చూపుతున్న నిరంతర నిబద్ధతను మేం స్వాగతిస్తున్నాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ కోసం విశాఖపట్నాన్ని భారతదేశంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా తీర్చిదిద్దడానికి ఐబీఎంతో కలిసి పనిచేయడానికిఎదురుచూస్తున్నామని అన్నారు.

**ప్రపంచ ఆవిష్కరణల గమ్యస్థానంగా భారత్‌ను తీర్చిదిద్దుతాం** : ఈ సందర్భంగా ఐబీఎం ఇండియా, సౌత్ ఏసియా మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పటేల్ మాట్లాడుతూ... వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో భారతదేశానికి డిజిటల్ యుగంలో ప్రపంచానికి నాయకత్వం వహించే అపూర్వ అవకాశం ఉంది. ప్రతిభ, ఆవిష్కరణలు, సాంకేతిక సామర్థ్యాలను సమన్వయం చేసుకుంటూ ఈ లక్ష్యాన్ని సాధించవచ్చు. ఐబీఎంలో మేం, మా ఖాతాదారులు ఏఐతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను అందిపుచ్చుకుని, దీర్ఘకాలిక విలువను సృష్టించేందుకు అవసరమైన సామర్థ్యాలను నిర్మించడానికి కట్టుబడి ఉన్నాం. విశాఖపట్నంలోని ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఏర్పాటు ఇందుకు నిదర్శనం. అలాగే ప్రపంచస్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక సేవల కేంద్రంగా భారతదేశ స్థాయిని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు.

**యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తాం** : ఐబీఎం కన్సల్టింగ్ ఫ్యూచర్‌నౌ సెంటర్ ఇండియా మేనేజింగ్ పార్ట్‌నర్ ఉషా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రతిభ, బలమైన విద్యాసంస్థలు, టెక్నాలజీ ఎకోసిస్టమ్ వల్ల ప్రపంచ ఖాతాదారుల డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవసరాలకు మద్దతు ఇచ్చే కీలక కేంద్రంగా మారుతోంది. ఐబీఎం ఫ్యూచర్‌నౌ సెంటర్ ద్వారా అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాలను స్థానిక ప్రతిభతో సమన్వయం చేస్తాం. ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను వేగవంతం చేయడంతో పాటు, స్థానిక యువతకు మరింత మెరుగైన ఉపాధి అవకాశాలను సృష్టించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐబీఎంకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# బాలానగర్‌లో ప్రజా సమస్యలపై కమిషనర్ సృజన క్షేత్రస్థాయి సమీక్ష

సైబరాబాద్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీమతి సృజన మంగళవారం "ఒక రోజు-ఒక వార్డు" కార్యక్రమంలో భాగంగా కూకట్‌పల్లి మండల పరిధిలోని బాలానగర్ వార్డును సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజు కాలనీలోని రాజు సామాజిక భవనంలో నిర్వహించిన సమావేశంలో స్థానికులతో ముఖాముఖి మాట్లాడి వారి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల కమిషనర్, ఉప కమిషనర్‌తో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్, మాజీ మున్సిపల్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. రాజు సామాజిక భవనంలో మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పించాలని, బాలానగర్ కాలువ వెంట రక్షణ గోడ నిర్మించి భూక్షయం నివారించాలని



ప్రజలు కోరారు. దోమల నివారణకు వార్డు అంతటా క్రమం తప్పకుండా పొగమందు పిచికారీ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వినాయక్‌నగర్, రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతాల్లో వీధి కుక్కల సమస్యను వెంటనే పరిష్కరించాలని, సీబీఆర్ కాలనీ శ్మశానవాటికలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రధాన రహదారిపై పాదచారుల కోసం పైవంతెన నిర్మించాలని, మరమ్మతుల అనంతరం రహదారులపై మిగిలిన మట్టి, శిథిలాలను తొలగించాలని, వెలుతురు లేని ప్రాంతాల్లో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. రద్దీ రహదారి దాటే సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల వినతులను ఓర్పుగా విన్న కమిషనర్ సృజన, ప్రతి సమస్యను ప్రాధాన్యంతో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి, మౌలిక సదుపాయాలను వేగంగా మెరుగుపరచడమే "ఒక రోజు-ఒక వార్డు" కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

# కుషాయిగూడ బస్ స్టాప్ సమస్యల పరిష్కారానికి పోలీసు అధికారులకు వినతి






కాప్రా, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : కుషాయిగూడ బస్ స్టాప్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యలు, ట్రాఫిక్ చలాన్లపై ప్రజల్లో వ్యక్తమవుతున్న ఆందోళన, రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన బారికేడ్ల వల్ల బస్సుల రాకపోకలకు ఏర్పడుతున్న ఇబ్బందులపై కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం కుషాయిగూడ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్‌ను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బస్ స్టాప్ వద్ద బారికేడ్ల కారణంగా ప్రజలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, ముఖ్యంగా వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ట్రాఫిక్ చలాన్ల అమలులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా వివరించారు. దీనిపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ సానుకూలంగా స్పందించి సమస్యను పూర్తిగా పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ ఏసీపీ, ట్రాఫిక్ డీసీపీ దృష్టికి అంశాన్ని తీసుకెళ్లి, సమగ్రంగా వివరించి వీలైనంత త్వరగా పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని తెలిపారు. కుషాయిగూడ ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించిన పోలీసు అధికారులకు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో పనగట్ల చక్రపాణి గౌడ్, చల్లా ప్రభాకర్, కొడకండ్ల యాదయ్య, రేగొండ వెంకటేశ్వర్లు, పండాల గణేష్ గౌడ్, బ్రహ్మాచారి, నాలచెరువుల జనార్ధన్, పిట్టల రాజు ముదిరాజ్, చినంగిని దయానంద్, రమేష్ చౌదరి, నాగరాజు, సకరామ్ చౌదరి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యం

– జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య

మంచిర్యాల, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులకు సురక్షితమైన వాతావరణంతో పాటు నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, మండల విద్యాధికారి, మున్సిపల్ చైర్‌పర్సన్, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాళ్లతో కలిసి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన ముల్కలగూడ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పాఠశాల ప్రాంగణంలో నిల్వ ఉన్న వర్షపు నీటిని పరిశీలించి, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమీప ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులను తాత్కాలికంగా తరలించిన చర్యను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల చదువుకు ఎలాంటి అంతరాయం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులను తరలించిన సమీప ప్రభుత్వ పాఠశాలను సందర్శించి తరగతి గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ప్రతికూల పరిస్థితులలోనూ విద్యా బోధన నిరంతరాయంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులలో ఎలాంటి ఆందోళన లేకుండా సానుకూల వాతావరణాన్ని కల్పించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన అన్ని సౌకర్యాలను వెంటనే అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి తరగతి గదులు, గ్రంథాలయం, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యా సదుపాయాలపై అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, గ్రంథాలయ వినియోగం,



క్రమబద్ధమైన బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో మెరుగైన విద్యా ప్రమాణాలు నెలకొనేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. అనంతరం దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో పర్యటించిన ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించారు. మండల తహసీల్దార్‌తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారుల ఇళ్లను సందర్శించి నిర్మాణాల పురోగతి, ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం, ఎదురవుతున్న సమస్యలపై లబ్ధిదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామంలోని పల్లె దవాఖానను సందర్శించి ఓ.పి. నమోదు, ఔషధ నిల్వ రిజిస్టర్లు, తల్లి-శిశు ఆరోగ్య సేవల రికార్డులు, టీకాల నమోదు వివరాలను పరిశీలించారు. దవాఖానలో మందుల లభ్యత, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణపై వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, వంటశాల, భోజనశాల, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. పోషకాహార ప్రమాణాలకు అనుగుణంగా పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం ప్రతిరోజూ అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వర్షంలో ప్రజలకు సేవలందించిన పోలీసులు

నిజామాబాద్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాసేవే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని నిజామాబాద్ సీపీ సాయి చైతన్య అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ మధ్యకాలంలో కురిసిన భారీ వర్షాల సమయంలో ప్రజలకు సేవలందించిన ఆరో టౌన్ పోలీసు సిబ్బందిని సీపీ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ సంబంధిత పోలీస్ స్టేషన్ పరిధిలోఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రధాన రహదారి పై భారీగా వరద నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో టౌన్-6 ఎస్ఐ కే సందీప్ ఆదేశాలతో ఏఎస్ఐ జక్రయ్య, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా హుటాహుటిన స్పందించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ ను సమర్థవంతంగా నియంత్రించినట్లుగా సీపీ పేర్కొన్నారు. భారీ వర్షం నీరు కారణంగా డ్రైనేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో వరద నీటి ప్రవాహం రోడ్డుపై నిలిచిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడగా దాన్ని గమనించిన పోలీస్ సిబ్బంది , సంబంధిత శాఖ అధికారులతో సమన్వయం చేసి జేసీబీల సహాయంతో ఉదయం నుండి సాయంత్రం వరకు డ్రైనేజీలను పూర్తిగా శుభ్రం చేయించినట్లు చెప్పారు. దీంతో రహదారిపై రాకపోకలు మళ్లీ ప్రారంభమైనట్లు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యంత అంకితభావంతో విధులు నిర్వహించిన 6 టౌన్ పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శాలువాలతో ప్రత్యేకంగా సత్కరించి, అభినందిస్తూ ప్రశంసించారు.

## బస్ భవన్ వద్ద ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు భారీ నిరసన



సైబరాబాద్, పెండింగ్ బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇతర డిమాండ్ల సాధన కోసం తెలం గాణ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలో బస్ భవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో బస్ భవన్‌కు చేరు కొని తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ మేనేజ్మెంట్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన నేపథ్యంలో పోలీసులు భారీగా మోహ రించారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు మాట్లాడుతూ రిటైర్మెంట్ కార్మి కులకు రావలసిన 2017, 2021 సంవత్సరాల బకాయిలు త్వరగా చెల్లించాలని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు 2 నెలలకు సరిపడా మందులు అందించాలన్నారు. మరణించిన ఉద్యోగి భార్య/ భర్తలకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించాలని కోరారు. వితంతు ఉద్యోగులకు PF, గ్రాట్యుటీ, పెన్షన్ కేసులను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కనే మురుగు నీటితో దుర్వాసన

– అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల మండిపాటు
– డెంటల్ కాలేజీ డ్రైనేజీ నీరు శివారెడ్డి చెరువులోకి..
– చర్యలు తీసుకోవాలని వినతి
– అండర్ డ్రైనేజీ, రోడ్లు, దోమలు, వీధి దీపాల సమస్యల చర్యలు ఎక్కడ..?

వికారాబాద్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : వికారాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయ సమీపంలో మురుగు వాసనతో కంపు కొడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు అని కాలనీవాసులు వాపోయారు గత కొన్ని రోజులుగా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోవడం లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పాలన కార్యాలయంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక గ్రామాల పరిస్థితి పట్టణాల పరిస్థితి ఏంటి అని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మంగళవారం వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 5వ, 6వ, 15వ వార్డులకు చెందిన నాయకులు, కాలనీవాసులు వికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



ను కలిసి తమ కాలనీల్లో నెలకొన్న పలు మౌలిక వసతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, తమ ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, రోడ్లు అధ్వాన్నంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ సమస్యల కారణంగా దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వికారాబాద్ పట్టణంలో అనేక వీధుల్లో వీధి దీపాలు పనిచేయక పోవడంతో రాత్రి వేళల్లో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ వెంటనే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను అత్యవసరంగా పరిష్కరించాలని ఆదేశించారు. వారం రోజుల్లో కాలనీల్లో ఉన్న ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. 5వ వార్డ్ వార్డులో డెంటల్ కాలేజ్ డ్రైనేజ్ మొత్తం శివారెడ్డి పేరు చెరువులో కలుస్తుందని పలుమార్లు అధికారులకు చెప్పిన పట్టించు కోవడం లేదు అని 5వ వార్డ్ కాలనీవాసులు గడ్డం ప్రసాద్ కుమార్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ దిశా కమిటీ మెంబర్ వడ్ల నందు, టిఆర్ఎస్ నాయకులు బిజెపి నాయకులు కాలనీవాసులు. శ్రీనివాస్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



# భారీ వర్షాలతో కొత్తపేట డివిజన్లో ప్రజల అవస్థలు

– స్పందించిన మాజీ కార్పొరేటర్ పవన్ కుమార్
– మ్యాన్ హోల్స్ నిండి రోడ్లపై డ్రైనేజీ..
– అంబేద్కర్ నగర్‌లో హైడ్రా సిబ్బందితోసహాయక చర్యలు



కొత్తపేట, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : కొత్తపేట డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ కాలనీలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు భారీగా చేరి పలు ఇళ్లలోకి ప్రవేశించింది. డ్రైనేజీ కాల్వలు పూర్తిగా మూసుకుపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని, రాకపోకలు సైతం నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. స్థానికుల సమాచారం అందుకున్న వెంటనే కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్అంబేద్కర్ కాలనీకి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగాపరిశీలించారుప్రజల ఇబ్బందులను గుర్తించి స్వయంగా డ్రైనేజీ అడ్డంకులను తొలగిస్తూ, ప్రజలు సురక్షితంగా రాకపోకలు సాగించేలా పరిసరాలను శుభ్రం చేయించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి హైడ్రా సిబ్బందిని వెంటనే సంఘటనా స్థలానికి రప్పించి ప్రత్యేక శుభ్రపరిచే చర్యలు చేపట్టారు. ప్రభావిత ప్రాంతాన్ని పూర్తిగా శుభ్రం చేయడంతో పాటు, భవిష్యత్తులో భారీ వర్షాలు కురిసినా ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసు కోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాలనీవాసులు మధు, నవీన్, శ్రీశైలం, యాదయ్య, బీజేపీ నాయకులు వగ్గుల సుందర్ నారాయణ, వెంకట్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అలియాబాద్‌లో ఘనంగా వనమహోత్సవం

ప్రజలకు మొక్కల పంపిణీ చేసిన చైర్ పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి



శామీర్ పేట్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి పాల్గొని మొక్కలు నాటి ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ కంతం శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధచూపాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలోమున్సిపల్అధికారులు,సిబ్బంది,ప్రజాప్రతినిధులు,వార్డుప్రజలు పాల్గొన్నారు.

# చందానగర్ అపార్ట్‌మెంట్‌లో లిఫ్ట్ ప్రమాదం..

– మహిళ మృతి, పోలీస్ స్టేషన్‌లో భర్త ఫిర్యాదు



శేర్లింగంపల్లి, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : చందానగర్‌లోని అన్నపూర్ణ ఎన్‌క్లేవ్‌లో లిఫ్ట్ ప్రమాదంలో భార్య అనసూయ (43) మృతి చెందిన ఘటనపై ఆమె భర్త ధాడి శ్రీనివాస్ చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బంధువును పరామర్శించేందుకు వెళ్లిన సమయంలో లిఫ్ట్‌లోకి ఎక్కుతుండగా తలుపులు పూర్తిగా మూసుకోకముందే లిఫ్ట్ పైకి కదలడంతో అనసూయ లిఫ్ట్, ప్రవేశ ద్వారం మధ్య ఇరుక్కుపోయి తీవ్రంగా గాయ పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆస్పత్రికి తరలించగా వైద్యులు ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. లిఫ్ట్ మరమ్మత్తు పనుల సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేయకపోవడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. లిఫ్ట్ టెక్నీషియన్ అనిల్ కుమార్, అపార్ట్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు రామ్‌రెడ్డి, యోగేందర్, వెంకట్‌రెడ్డి, అలాగే లిఫ్ట్ మెయింటెనెన్స్ కంపెనీ యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చందానగర్ పోలీసులను కోరారు.

# నెలాఖరులోగా గౌడవల్లి రైల్వే అండర్‌పాస్ పూర్తి

– రైల్వే అధికారుల వెల్లడి..



మేడ్చల్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుండ్ల పోచంపల్లి డివిజన్ గౌడవల్లిలో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్‌పాస్ (ఆర్‌యూబీ) పనులను గ్రామ మాజీ సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల ఫోరం మాజీ అధికార ప్రతినిధి, గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్ మంగళవారం రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు పనుల పురోగతిని వివరించి, ఈ నెలాఖరులోగా అండర్‌పాస్ నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభోత్సవం నిర్వహిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే గౌడవల్లి ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పాలకుర్తి మురళి గౌడ్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు డి. గోపాల్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్. వినోద్ గౌడ్, మాజీ వార్డు సభ్యులు రాజు గౌడ్, టి. రవికుమార్‌తో పాటు గ్రామ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

– మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ



మేడ్చల్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మేడ్చల్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ ఖండించారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందేందుకు కేటీఆర్ ప్రయత్నించడం తగదన్నారు. గతంలో ఇంజినీరింగ్ విద్యార్థులు, ఇంజినీరింగ్ కళాశాలలపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలను ముందుగా గుర్తు చేసుకోవాలని సూచించారు. యువతను, విద్యార్థులను మోసం చేసింది గత బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆరోపించిన ఆయన ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ప్రైవేట్ రంగంలోనూ ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. ప్రెస్‌మీట్లు, బహిరంగ సభల పేరుతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కేటీఆర్ విరమించుకోవాలని మహేష్ కురుమ సూచించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలు కొనసాగితే ప్రజలే మరోసారి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## మహంకాళి జాతరకు కేటీఆర్‌కు ఆహ్వా నంమల్కాజ్‌గిరి ఫలారం బండి ఊరేగిం పునకు హాజరు కావాలని విజ్ఞప్తి




**హైదరాబాద్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
మల్కాజ్‌గిరిలో ఈ నెల 10న నిర్వహించనున్న మహంకాళి జాతర ఫలారం బండి ఊరేగింపునకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావును మాజీ కార్పొరేటర్ నిరుగొండ జగదీశ్‌గౌడ్ ఆహ్వానించారు.మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు కేటీ రామారావును మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజ్‌గిరికి చెందిన నల్లవెల్లి కార్తీక్‌ను కేటీ రామారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అరుణ్ తేజ, నవీన్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఆర్ తెలిసుంటే ప్రాణాలు కాపాడొచ్చు

### -మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం

**నేరెట్‌మెట్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**



అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన బాధితుడికి సకాలంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రీస సిటేషన్) అందిస్తే ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని సెంజాన్ అంబులెన్స్ ఇండియా సీనియర్ ఫ్యాకల్టీ కలారి సంతోష్‌కుమార్ అన్నారు. మల్కాజ్‌గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సీపీఆర్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.సీపీఆర్ ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన ప్రాణరక్షక నైపుణ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలు, గుండెపోటు, శ్వాస సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ చేరుకునేలోపు బాధితుడికి సీపీఆర్ అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని వివరించారు. అనంతరం సీపీఆర్ చేసే సరైన విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించి, విద్యార్థులతో సాధన చేయించారు.కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు ప్రాణరక్షణకు ఉపయోగపడే జీవన నైపుణ్యాలను కూడా అలవర్చుకోవాలని సూచించారు. సమాజ సేవలో యువత ముందుండాలని ఆకాంక్షించారు.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎడ్ల ప్రదీప్, డాక్టర్ హరిత, డాక్టర్ జి.ఎన్. జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. రాజేశ్‌కుమార్, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్, డాక్టర్ మల్లిక, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఖమ్మంలో హెచ్ఆర్సీసీఐ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవం

**ఖమ్మం, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**




మానవ హక్కుల పరిరక్షణ సంస్థ ఖమ్మం జిల్లా నూతన కార్యాలయం జిల్లా చైర్మన్ పుచ్చకాయల దేవేందర్ సెక్రెటరీ చింతల రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఖమ్మం నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్లో సంస్థ జాతీయ అధ్యక్షులు సింగమాల వెంకట రమణయ్య, రాష్ట్ర చైర్మన్ డాక్టర్ కిషోర్ కుమార్ చేతుల మీదగా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు సింగమల వెంకటరమణ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో హెచ్ఆర్సీసీఐ నూతన కార్యాలయాన్ని భారీ ఎత్తున ప్రారంభించినందుకు కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. సంస్థలో పనిచేసేందుకు ఉత్సాహం ఉన్నవారు లాభార్జన కోసం కాకుండా సేవ చేసే గుణం ఉంటేనే కమిటీ సభ్యులుగా చేరాలని అన్నారు. సంస్థ యొక్క నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని విధివిధానాలను గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం వర్కింగ్ చైర్మన్ బెస్త సంజీవరావు జనరల్ సెక్రెటరీ ఎం బాబురావు రాష్ట్ర మహిళా చైర్మన్ పాదం అజంతా సెక్రటరీ సంక గణేష్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్సీసీఐ సభ్యులు చిలక బత్తిని కనకయ్య సయ్యద్ షారుక్ ఇమ్రాన్ కొప్పుల రామకృష్ణ వరప్రసాద్ గుర్రం మనోజ్ కన్నెగంటి నాగేశ్వరరావు అలియాస్ థామస్ నవీన్ నాగేశ్వరరావు కార్యాలయం విజయవంతానికి విశేషంగా కృషి చేయడంతో వారిని జాతీయ రాష్ట్ర బృందం అభినందించి దుస్సాల్వతో సన్మానించారు. కార్యక్రమానికి అతిధులుగా నాయకులు బొమ్మల శంకర్ అవినాష్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల నాటికి సీతారామాలయ పునర్నిర్మాణ పనులు పూర్తి చేయాలి

- ఆలయ ప్రాచీనతకు భంగం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానంలో చేపడుతున్న పునర్నిర్మాణ, అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆలయంలో జరుగుతున్న పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు.ఉత్తర ద్వార దర్శనం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, ముక్కోటి ఏకాదశి నాటికి వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బంది, యంత్రాలను వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఆలయం చుట్టూ తూర్పు, దక్షిణ, పడమర వైపుల కొనసాగుతున్న పునర్నిర్మాణ పనులను పరిశీలిస్తూ, ఆలయ ప్రాచీనతకు ఎలాంటి భంగం కలగకుండా నిర్మాణాలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి అన్ని ప్రధాన పనులు పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఆలయం నుంచి గోదావరి ఘాట్ వరకు కాలినడకన పరిశీలించిన కలెక్టర్, రోడ్డు విస్తరణ, పాదచారుల మార్గాలు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ వెలుగులు, భద్రత, సూచిక బోర్డులు, ట్రాఫిక్ నిర్వహణ వంటి మౌలిక సదుపాయాలను పుష్కరాలకు ముందే పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు.చిత్రకూట మండపంలో జరుగుతున్న తొలగింపు పనులను పరిశీలించిన ఆమె, పురాతన రాతి స్తంభాలు, శిల్ప సంపదకు ఎలాంటి నష్టం కలగకుండా శాస్త్రీయ పద్ధతిలో పనులు నిర్వహించాలని ఆదేశించారు. రాతి స్తంభాలను గుర్తింపు సంఖ్యలతో నమోదు చేసి నిపుణుల పర్యవేక్షణలో భద్రపరుస్తున్నట్లు అధికారులు తెలిపారు.అనంతరం స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్‌కు ఆలయ అధికారులు, అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఏడాది మార్చిలో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు పనుల పురోగతిని సమీక్షించేందుకు ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు.గోదావరి పుష్కరాల నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటోందని, పరిపాలనా, సాంకేతిక, ఆర్థిక అంశాలను సమన్వయం చేస్తూ పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ఆలయ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం రోడ్లు-భవనాల శాఖ నుంచి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఆర్అండ్‌బీ ఈఈ నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ అధికారులు, ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల్లో నాణ్యమైన పోషకాహారం అందించాలి

- లాల్గాడి మలకపేట కేంద్రాన్ని పరిశీలించిన బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు సరిత, చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి



**శామీర్‌పేట, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**
అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పోషకాహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలంగాణ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు సరిత గోగుల సూచించారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని లాలాడి మలకపేట అంగన్‌వాడీ (హెచ్‌బీపీఎల్) కేంద్రాన్ని మంగళవారం ఆమె, మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, పరిశుభ్రత, నిర్వహణ తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, ప్రతి అర్హుడికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారునికి చేరేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.తనిఖీలో అలియాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంకి రమేష్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు జశ్వంత్‌రెడ్డి, మౌనిక బాబు, స్వప్న రాంప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బిక్షపతి, సీనియర్ నాయకులు అశోక్‌రెడ్డి, భాస్కర్ గౌడ్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

## భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్ )

**చిన్నంబావి, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**



చిన్నంబావి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తాజా గణాంకాల ప్రకారం మండలంలో మొత్తం 24,724 మంది ఓటర్లలో 22,099 మంది ఎలక్టర్ ఫారాలు డిజిటైజ్ చేయబడగా, 22,095 ఫారాలను బూత్ లెవల్ అధికారులు ( బిఎల్ఓలు ) ధృవీకరించారు. దీంతో 89.38 శాతం పురోగతి నమోదు కావడం విశేషం. మండలంలోని 32 పోలింగ్ కేంద్రాల పరిధిలో బిఎల్ఓ లు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి వివరాలను సేకరించడం, అవసరమైన పత్రాలను పరిశీలించడం, డిజిటల్ నమోదు పూర్తి చేయడం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అదే విధంగా డూప్లికేట్ ఎంట్రీలు ( డి.ఎస్.ఇ ), గైర్హాజరు, మరణించిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల ( ఏ ఎస్ డి / యుఈఎఫ్ ) వివరాలను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎన్నికల జాబితాను మరింత పారదర్శకంగా తీర్చిదిద్దే చర్యల ప్రక్రియ కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా తహసీల్దార్ మరియు సహాయ ఎన్నికల నమోదు అధికారి కె. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి అర్హత కలిగిన ఓటరిని జాబితాలో నమోదు చేయడంతో పాటు అర్హత లేని నమోదులను తొలగించే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంకా మిగిలిన ఓటర్లు తమ ఎలక్టర్ ఫారాలను త్వరితగతిన సమర్పించి, బిఎల్ఓ లకు అవసరమైన సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక సవరణ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ లు) మరియు సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని తహసిల్దార్ శ్రీనివాస్ ఈ సందర్భంగా కోరారు.

## సర్ ను పూర్తి స్థాయిలో చేయడానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి

**- రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఓటరు జాబితా నమోదు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం పూర్తి చేయడానికి రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని నియోజకవర్గం ఎలక్టోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కిస్మత్ పూర్ లో గల రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సర్ కార్యక్రమం పై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 60 శాతం మంది ఓటర్లు తమ ఎన్యుమరేషన్ పారాలను బీఎల్ఓ లకు అందజేశార న్నారు. మిగతా ఓటర్లు కూడా మిగిలిన ఆరు రోజులలో తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి తిరిగి ఇచ్చే టట్లు రాజకీయ పార్టీల నాయకులు చొరవ తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు ఓటర్లు తమ పేర్లను మ్యాపింగ్ చేసుకోనట్లయితే బీ ఎల్ ఓ లను కలసి మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.




## మియాపూర్ డివిజన్ పలు ప్రాంతాలలో సర్ కార్యక్రమాలను పరిశీలించిన సంగీత వీరేందర్ గౌడ్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 05 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మాకంగా చేపట్టిన సర్ ఓటర్ క్రమబద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా మియాపూర్ డివిజన్లో పలు ప్రాంతాల్లో సర్ జరుగుతున్న ఓటర్ ఎన్రోల్మెంట్ యొక్క పురోగతిని పరిశీలన చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు మాజీ వార్డ్ కమిటీ మెంబెర్ సంగీత వీరేందర్ గౌడ్. మంగళవారం రోజు మియాపూర్ డివిజన్ లోని విడియా కాలనీ, ప్రగతి ఎంక్లేవ్ కమిటీ హాల్, జేపీ నగర్ కమిటీ హాల్ లోని పలు కేంద్రాలలో పరిశీలన చేసి ఓటర్ నమోదు ప్రక్రియ ఎంతవరకు జరిగింది, ఇంకా ఎంత మంది నమోదుకు రానివారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 10వ తేదీ లోగా ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా ఓటరు నమోదు ప్రక్రియను వినియోగించుకోవాలని తెలియజేశారు. సర్ కార్యక్రమ నిర్వాహక కేంద్రం లో బి ల్ ఓ లు, బి ల్ ఏ ల పనితీరు గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఐ ఎన్ టి యు సి నాయకులు నల్ల సంజీవరెడ్డి,టిపిసిసి లేబర్ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శులు వీరమల్ల వీరేందర్ గౌడ్, ఉయ్యూరు శ్రీదేవి, డిసిసి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి ముద్దంగుల తిరుపతి, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ కార్యదర్శి మన్నే నరేందర్ ముదిరాజ్ ,మియాపూర్ డివిజన్ లేబర్ సెల్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి,బ్రహ్మానందం నాగరాజు ,అజయ్ రెడ్డి, ఉయ్యూరు రామారావు మరియు కాలనీవాసులు మహేష్ రేడ్డి, వెంకట్ రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .



## శ్రీరామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

**శేరిలింగంపల్లి, ఆగస్టు05(జర్నలిస్ట్ ఫైల్) :**

ఆగస్టు 1 నుండి 7 వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా కొండా పూర్ డివిజన్ శ్రీరామ్‌నగర్ 'బి' మరియు 'సి' బ్లాక్ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల విశిష్టతను, బిడ్డకు జన్మించిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరంగా తెలియజేశారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధినిరోధక శక్తిని పెంచి ఆరోగ్యంగా ఉంచుతాయని వివరించారు. అంతేకాకుండా గర్భిణులు, బాలింతలకు అవసరమైన పోషకాహార నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వేడుకగా "అన్నప్రాసన" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పి. రాధ, మౌలానీ, ఆశా కార్యకర్త సుజాతతో పాటు స్థానిక బాలింతలు, గర్భిణులు , తల్లులు పాల్గొన్నారు.



## 10న జరిగే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**- కంబాలపల్లి ఆనంద్దిండి**

**దిండి, ఆగస్టు05(జర్నలిస్ట్ ఫైల్) :**

ఈ నెల 10న ప్రజా సంఘాలు, సీఐటీయూ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ పిలుపునిచ్చారు.మంగళవారం గుడిపల్లి మండలంలోని గాట్ నెమలి పురం గ్రామంలో నిర్వహించిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 1942 ఆగస్టు 9న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో ఆగస్టు 10న దేశవ్యాప్తంగా 550 జిల్లాల్లో జైల్ భరో కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వం భరించే 90 శాతం నిధులను 60 శాతానికి తగ్గించి, రాష్ట్రాల వాటాను 10 శాతం నుంచి 40 శాతానికి పెంచడం సరైన విధానం కాదని విమర్శించారు.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు వ్యవసాయ ఉత్పత్తులకు సాగు వ్యయానికి అదనంగా 50 శాతం కలిపి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రకటించాలని డిమాండ్ చేశారు. గతంలో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రైతు ఉద్యమంలో మరణించిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు.26 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం కార్మికులకు అన్యాయమని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం, పీఎఫ్, గ్రాట్యుటీ, బీమా వంటి హక్కులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటనపై ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు. నీట్ పేపర్ లీకుల కారణంగా దేశవ్యాప్తంగా 21 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొంటూ, వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ కార్మికులు, కూలీలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య, గుడిపల్లి మండల కార్యదర్శి కోన్‌రెడ్డి లక్ష్మయ్య, రైతు సంఘం నాయకులు చంద్రమౌళి, బూరి రాములు, లింగస్వామి, వెంకటరాములు, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



## తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

- మధిర ప్రాజెక్టు మడుపల్లిలో ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు
- సూపర్వైజర్ జక్కుల నాగ సత్యవతి ఆధ్వర్యంలో

**మధిర, ఆగస్టు05 (జర్నలిస్ట్ ఫైల్) :**

మధిర ప్రాజెక్టు సెక్టార్ 2 మడుపల్లి అంగన్వాడి సెంటర్లో సెక్టార్ సూపర్వైజర్ జక్కుల నాగ సత్యవతి ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ కృష్ణ శ్రీ పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు, శిశువుకు రోగ నిరోధక శక్తిని పెంచుతాయని తల్లిపాలు తప్పక బిడ్డకు పట్టించాలని తెలియజేశారు. డబ్బా పాలు పట్టించటం వలన శిశువు ఎదుగుదలతో పాటు భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. అనంతరం.. వార్డ్ కౌన్సిలర్ నర్సిరెడ్డి మాట్లాడుతూ నవజాతి శిశువులకు తల్లిపాలు శ్రేష్టమన్నారు. తల్లి బిడ్డల శ్రేయస్సుకు తల్లిపాలు వినియోగం ఎంతో అవసరమని వివరించారు. అనంతరం డాక్టర్ పృథ్వి మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే తల్లిపాలు పట్టించాలన్నారు.మొదటి ఆరు నెలలు తల్లిపాలు శ్రేష్టమన్నారు. డబ్బా పాలు వద్దు – తల్లి పాలు ముద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు.అనంతరం పిల్లలకు అన్నప్రాసన, మరియు గర్భిణీలకు, శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్స్ లక్ష్మీ తులసి, సునీత,డాక్టర్ సుష్మ, వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి ,సితారా అంగన్వాడీ టీచర్స్ లక్ష్మి , రాధామాణిక్యం, శివకుమారి, మేరీ కుమారి, ఆయాలు విజయ, మరియు బాలింతలు, గర్భిణీలు, తల్లిదండ్రుల పిల్లలు పాల్గొన్నారు.





## ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి

**- సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్న జిల్లా ఎస్పీ డా. శబరీష్**

**మహబూబాబాద్, ఆగస్టు05 (జర్నలిస్ట్ ఫైల్) :**

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, హైదరాబాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య మాసాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "సురక్ష కా తిరంగా – సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన ప్రచార కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ఆగస్టు 5న మధ్యాహ్నం 12.00 గంటలకు మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ప్రారంభించనున్నట్లు జిల్లా ఎస్పీ డా. శబరీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఆగస్టు నెల మొత్తం జిల్లాలో సైబర్ నేరాల నివారణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాలను నివారించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో స్టాక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, బిజినెస్ ఇన్వెస్ట్మెంట్ మోసాలు, ఆన్‌లైన్ ట్రేడింగ్ మోసాలు, డిజిటల్ అరెస్ట్, ఫేక్ లోన్ యాప్‌లు, ఓటీపీ, కేవైసీ, సోషల్ మీడియా, ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు అధికంగా జరుగుతున్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సురక్ష కా తిరంగా" ప్రచార సందేశమైన "ఆగు – ఆలోచించు – నిజం నిర్ధారించు – సైబర్ భద్రత పెంచు" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు. జాతీయ సైబర్ జాగృక్తా దివస్ సందర్భంగా నేటి నుండి ఆగస్టు నెల పొడవునా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, గ్రామ పంచాయతీలు మరియు సాధారణ ప్రజల భాగస్వామ్యంతో సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు ఎస్పీ సూచించారు.



## కుచెల్లపాడు రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ



- 1,054 మంది రైతులకు పాస్‌పుస్తకాలు అందజేసిన వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు

**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా వేమూరు మండలం వరహాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో కుచెల్లపాడు గ్రామానికి చెందిన 1,054 మంది అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్‌పుస్తకాలను వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు పంపిణీ చేశారు. గ్రామ స్థాయిలోనే రైతులకు ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల భూ హక్కుల పరిరక్షణ, భూ రికార్డుల్లో పారదర్శకత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. "మీ భూమి--మీ హక్కు" నినాదంతో వ్యక్తిగత ఫోటోలు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో మాత్రమే పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయడం ద్వారా రైతుల పట్ల ప్రభుత్వం నిష్పాక్షిక వైఖరిని చాటిచెప్పిందని పేర్కొన్నారు.

ప్రభుత్వ రాజముద్రతో కూడిన ఈ పాస్‌పుస్తకాలు రైతుల భూమిపై చట్టబద్ధమైన హక్కును మరింత బలోపేతం చేయడంతో పాటు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందడంలో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ చర్యతో భూ వివాదాలు తగ్గి, రైతుల్లో ప్రభుత్వంపై విశ్వాసం మరింత పెరుగుతుందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. భూమి యాజమాన్యంపై స్పష్టత రావడంతో తమకు మరింత భరోసా కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, రైతులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆగస్టు 17 నుంచి గుంటూరులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై కఠిన నిషేధం




- ఉల్లంఘనలకు భారీ జరిమానాలు
- ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో తనిఖీలు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆగస్టు 17 నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేయనున్నట్లు నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ప్రకటించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలు, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం వార్డ్ సచివాలయాల వారీగా ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు, ప్రజారోగ్య అధికారులు, పారిశుధ్య సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలో నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు డిప్యూటీ కమిషనర్లు, హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ సూపర్‌వైజర్లతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఆగస్టు 17 తర్వాత ఈ కమిటీ ప్లాస్టిక్ తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తుందని చెప్పారు. ప్రత్యేక బృందాలతో నగరవ్యాప్తంగా గోడౌన్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాలు, వీధి వ్యాపారుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ లభిస్తే వెంటనే సరుకును స్వాధీనం చేసుకుని, 'స్వచ్ఛ గుంటూరు' యాప్ ద్వారా అక్కడికక్కడే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. నిబంధనలను పదేపదే ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజలు, వ్యాపారుల్లో అవగాహన పెంచేందుకు అన్ని వార్డుల్లో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా, యువజన సంఘాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, ప్రజారోగ్యానికి కలిగే నష్టాలు, ప్రత్యామ్నాయాలపై విస్తృత ప్రచారం చేపడతామని చెప్పారు. ప్లాస్టిక్ రహిత, పరిశుభ్రమైన గుంటూరు నగర నిర్మాణానికి ప్రజలు, వ్యాపార సంస్థలు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## 50 శాతం సబ్సిడీతో గడ్డి కత్తిరించు యంత్రాలు

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు కోసం గడ్డి కత్తిరించు యంత్రాలను 50 శాతం సబ్సిడీతో ఇవ్వనున్నట్లు బ్రహ్మంగారిమఠం పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ గడ్డి కత్తిరించు యంత్రము సబ్సిడీ పోను రూ. 20,250/- అవుతుందని ఏడి తెలియజేశారు. ఈ యంత్రానికి 3 హెచ్.పీ మోటారు,సింగిల్ ఫేస్ విద్యుత్ మరియు త్రి బ్లేడ్ మిషన్ అమర్చి ఉంటుందన్నారు. ఈ యంత్రాలు కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాలలో ఏహెచ్ఎ లకు తెలియజేయగలరని ఆయన చెప్పారు. అలాగే గడ్డి విత్తనములు కావలసిన రైతు సోదరులు సంబంధిత కార్యాలయం నందు ఎవరికి ఎన్ని కేజీలు అవసరమో నమోదు చేసుకోవాలని ఏడి వెంకటసుబ్బయ్య తెలియజేశారు.

## వడ్డెరల అభ్యున్నతికి ఎన్డీయే ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయాలు - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- మైనింగ్ క్వారీల్లో 33% రిజర్వేషన్, సీనరేజ్ ఫీజులో 50% రాయితీ కల్పించాం
- "ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాలు" కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న "ఇంటింటికి కూటమి ప్రభుత్వం --సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 23వ డివిజన్ వడ్డెగూడెంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు, పుడా చైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు, వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం వడ్డెర సామాజిక వర్గ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు వడ్డెరలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్నారు.

వడ్డెర సహకార సంఘాల ఆర్థికాభివృద్ధికి మైనర్ ఖనిజ క్వారీల కేటాయింపుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించామని, కొత్తగా ఏర్పడిన వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజులు కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. వడ్డెర కార్మికులు, సహకార సంఘాలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు మైనింగ్ సీనరేజ్ ఫీజు, ప్రీమియంపై 50 శాతం భారీ రాయితీ కల్పించడం ద్వారా వారికి మరింత ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు.

బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వీర వడ్డె ఓబన్న సేవలను గుర్తిస్తూ ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే గతంలో చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన వడ్డెర కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసి, దాని ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఉపాధి అవకాశాలు, రుణ సదుపాయాలు, వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందిస్తున్నామని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాల ద్వారా కూడా వడ్డెర కుటుంబాలు పెద్దఎత్తున లబ్ధి పొందుతున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, దీపం 2.0 కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు సామాన్య కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ ప్రతి వర్గానికి న్యాయం చేసే విధంగా ఎన్డీయే ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ప్రజలు మరోసారి ఈ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపుతాం : ఎమ్మెల్యే నసీర్

- మాదక ద్రవ్యాలతో నిండు జీవితాలు బలి
- యువత డ్రగ్స్ జోలికెళికి వెళ్లొద్దు
- పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి
- ఇస్రాయెల్ పేటలో యువతకు అవగాహన కల్పించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలో డ్రగ్స్ మాటనేది వినిపించకుండా ఉక్కుపాదం మోపుతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక డీఎస్పీ, సీఐలతో కలిసి ఎమ్మెల్యే నసీర్ ఇస్రాయెల్ పేట వెళ్లారు. అక్కడ యువకులతో మాట్లాడి గంజాయి వలన కలిగే అ-నర్థాల గురించి అవగాహన కల్పించారు. నియోజకవర్గంలో ఎక్కడా డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించకూడదన్నారు. యువకులు డ్రగ్స్ కు బానిసైతే నిండు జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికపై ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో ఎక్కడ డ్రగ్స్ ప్రభావం ఉన్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. గోలీలు, సింగిల్ నంబర్ లాటరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గంజాయి నియంత్రణపై హోం శాఖ మంత్రి అధ్యక్షతన విద్యా, వైద్య, అబకారీ, గిరిజన సంక్షేమ శాఖల మంత్రులతో ప్రత్యేక క్యాబినెట్ సబ్-కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని అడ్డుకునేందుకు అమరావతి ప్రధాన కేంద్రంగా ఈగల్ (ఎలైట్ యాంటినార్కోటిక్ గ్రూప్ ఫర్ ఎన్ ఫోర్స్ మెంట్:) అనే ప్రత్యేక విభాగాన్ని 6 జిల్లాల్లో ఏర్పాటు చేశారన్నారు. గంజాయి, డ్రగ్స్ వ్యాపారంలో ఉన్న ప్రధాన సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యాసంస్థల్లో యువత డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో 40వేలకు పైగా 'ఈగల్ క్లబ్‌ల'ను ఏర్పాటు చేశామన్నారు. సంకల్పం 2.0 వంటి ప్రత్యేక చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చారని విమర్శించారు. నియోజకరవర్గంలోనూ గంజాయి విచ్చలవిడిగా విక్రయించారని, అరికట్టే వారే ప్రోత్సహించారని తెలిపారు.

గంజాయితో నాడీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని, మానవ సంబంధాలు దెబ్బతింటాయని తెలిపారు.

## విద్యార్థినుల భవిష్యత్తే ప్రభుత్వ ప్రాధాన్యం: ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ



**వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్):** బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు.

వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్పీ కాలనీలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) లో రూ. 1.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన వసతి భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు.

అనంతరం భవనాన్ని పరిశీలించి విద్యార్థినులతో ముచ్చటిస్తూ వారి చదువు, వసతి సౌకర్యాలు, పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, కేజీబీవీలో డార్మిటరీ గదులు లేక విద్యార్థినులు ఎన్నో సంవత్సరాలుగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. ఇప్పుడు రూ. 1.50 కోట్లతో ఆధునిక వసతులతో కూడిన నూతన భవనం అందుబాటులోకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

కొత్త గదులు అందుబాటులోకి రావడంతో విద్యార్థినులు సంతోషం వ్యక్తం చేయడం తనకు సంతృప్తినిచ్చిందని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని, వారి దూరదృష్టి వల్లే ఈ నూతన వసతి భవనం విద్యార్థినులకు అందుబాటులోకి వచ్చిందని పేర్కొంటూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బాలికలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన విద్య, మెరుగైన వసతి సౌకర్యాలతో విద్యార్థినుల భవిష్యత్తు మరింత ఉజ్వలంగా మారుతుందని, విద్యలో పెట్టే పెట్టుబడే రాష్ట్ర అభివృద్ధికి నిజమైన పునాది అని చీఫ్ విప్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులు వేగవంతం చేయాలి : జీఎంసీ కమిషనర్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టిన ఇన్నర్ రింగ్ రోడ్ ఫేజ్-3 పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం జీఎంసీ ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, పబ్లిక్ హెల్త్, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిని పరిశీలించారు. నగర ట్రాఫిక్ రద్దీ తగ్గించడంలో, భవిష్యత్ రవాణా అవసరాలకు ఈ ప్రాజెక్టు కీలకమని కమిషనర్ పేర్కొన్నారు.

రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న 16 విద్యుత్ స్తంభాల మార్పిడి పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ట్రాన్స్‌కో, సీపీడీసీఎల్ అధికారులకు ఆదేశించారు. విద్యుత్ లైన్ల మార్పిడి పనులు వేగవంతం చేసి రోడ్డు నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎన్ఎస్పీ కాలువ వెడల్పు పెంపు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని ఇరిగేషన్ శాఖకు సూచించారు. అలాగే వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఎత్తు పెంపు పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని చెప్పారు.

ఇన్నర్ రింగ్ రోడ్ విస్తరణకు ప్రభావితమైన స్థలాలకు సంబంధించి జీఎంసీ నుంచి పబ్లిక్ హెల్త్ శాఖకు అప్పగించాల్సిన మూడు స్థలాల బదిలీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. భూసేకరణ, స్థలాల అప్పగింత, యుటిలిటీల మార్పిడి వంటి అంశాల్లో ఆలస్యం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పనుల నాణ్యత, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ప్రభుత్వ ఐటీఐల్లో 400 ఏటీఓ పోస్టుల భర్తీకి విజ్ఞప్తి

- ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం అందజేసిన ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ నేతలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ (ఏటీఓ) పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీఐ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. రమేశ్ బాబు, ప్రధాన కార్యదర్శి కే. రత్నరాజు, ఉపాధ్యక్షుడు టి. కృష్ణకిషోర్ బుధవారం సచివాలయంలో ప్రధాన కార్యదర్శిని కలిసి పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఐటీఐల్లో ఖాళీగా ఉన్న సుమారు 400 అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే కోస్తా ఆంధ్ర ప్రాంతంలో సుమారు 10 కొత్త ప్రభుత్వ ఐటీఐలను ఏర్పాటు చేయాలని, ప్రస్తుతం డీఎల్‌టీసీ (ఋుఋజ)లుగా కొనసాగుతున్న సంస్థలను ప్రభుత్వ ఐటీఐలుగా పేరు మార్చాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఐటీఐల్లో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న సుమారు 290 మంది ఏటీఓల సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కూడా సంఘం నాయకులు కోరారు. ఈ అంశాలన్నింటినీ సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ప్రధాన కార్యదర్శి హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.

## సంక్షేమ-అభివృద్ధి కార్యక్రమాలపై డోర్ టు డోర్ ప్రచారం



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో రేకలకుంట టీడీపీ సీనియర్ నాయకులు మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమం రేకలకుంట పంచాయతీ లోని గొల్లపల్లె, బాగాదు పల్లె, చీకటి వారిపల్లెలో నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. గత రెండేళ్లలో ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, గ్రామాభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన చర్యలను తెలియజేస్తూ కూటమి ప్రభుత్వ పనితీరుకు ప్రజల మద్దతు కోరారు.

ఈ సందర్భంగా కానాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఇలాంటి డోర్ టు డోర్ ప్రచార కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఉత్తమ అధికారులుగా చిరస్మరణీయ సేవలు అందించండి : జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ

- సమస్య పరిష్కార వైఖరి అవసరం




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఉత్తమ అధికారులుగా చిరస్మరణీయ సేవలు అందించాలని గ్రూప్ వన్ యువ అధికారులకు జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ ఉద్బోధించారు. సమస్య పరిష్కార వైఖరి కలిగి ఉండాలని సూచించారు. 2026 గ్రూప్ వన్ బ్యాచ్ లో ఎంపికైన అభ్యర్థుల క్షేత్ర స్థాయి సందర్శనలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ లను బుధవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంచి వైఖరి కలిగి ఉండటం ఎంతో అవసరం అన్నారు. విశాల దృక్పథం కలిగి ఉండాలని, ఫలితాలు సాధించగలిగే యుక్తి ఉండాలని పేర్కొన్నారు. ఒక పనిలో తుది లక్ష్యం పక్కాగా సాధించగలిగే విధంగా ఉండగలిగాలని చెప్పారు. "మీ స్థానానికి న్యాయం చేయాలని" సూచించారు. వృత్తి ధర్మం పాటించాలని అన్నారు. పనిలో ఆనందం పొందాలని - సంతృప్తి సాధించాలని చెప్పారు. నిత్యం చేసే పని కంటే విభిన్నంగా, వినూత్నంగా చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కార దిశలో దాని మూలాలను శోధించి దానికి దీర్ఘకాలిక పరిష్కారం అందించగలగాలని అన్నారు. ప్రభుత్వానికి మంచి సంపదగా మీరు ఉండాలని అన్నారు. మంచి పని చేస్తూ, నిబద్ధతతో ఉంటే ప్రజల మనసులలో చిరస్మరణీయంగా ఉంటారని, గౌరవం పొందుతారని తెలిపారు. ఉద్యోగ ధర్మం నిర్వహణలో ఆదర్శవంతమైన నాయకునిగా ఉండాలన్నారు. వ్యవస్థలో నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారిగా వివిధ ప్రాంతాల్లో పర్యటించడం, గిరిజన విద్యార్థులకు సూపర్ 60 బ్యాచ్ నిర్వహించి ఐఐటి, ఎన్.ఐ.టి వంటి సంస్థలలో గిరిజన విద్యార్థులు చేరడం వంటి అంశాలు సంతృప్తి కలిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి అనుసంధానం వంటి సమస్యలు, ప్రసవాలు వంటి అంశాలను సమన్వయం చేయడం ప్రధానం అన్నారు. నెలకు ఎనిమిది, తొమ్మిది మాతృ మరణాలు ఉండగా "మాతృ దేవో భవ" కార్యక్రమాన్ని నిర్వహించి ఒకటికి తీసుకువచ్చామని తన అనుభవాలను పంచుకున్నారు. "అద్భుతమైన పనితీరు చూపండి - ఉద్యోగములో సంతృప్తి పొందండి" అన్నారు. ఏ సమయంలో నైనా నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణ ఉత్తమంగా చేయడం గొప్ప కళ అన్నారు. ఉద్యోగ బాధ్యతలను కుటుంబ మరియు ఇతర వ్యక్తిగత అంశాలతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తద్వారా వృత్తి నిర్వహణలో బాగా పనిచేయుటకు అవకాశం ఉంటుందని అన్నారు. ఇందుకు యోగా వంటి ప్రక్రియలను అవలంభించాలని సూచించారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాలు, విభిన్న విభాగాలలో పనిచేయడం జరుగుతోందని, అందులో మంచి అనుభవం పొందాలని అన్నారు. జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి మాట్లాడుతూ వివిధ శాఖల మధ్య సమన్వయం కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల సంస్థ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# ఆగస్టు 15 వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆగస్టు 15న నిర్వహించనున్న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (పొలిటికల్) జె. శ్యామలరావు ఆదేశించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడిలోని మినిస్టర్స్ క్వార్టర్స్ వెనుక ఉన్న పెరేడ్ గ్రౌండ్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. సాయి కాంత్ వర్మ, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అధికారులు పెరేడ్ గ్రౌండ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్ల పురోగతిని సమీక్షించారు.

రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి సహా పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వేడుకలకు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని శ్యామలరావు స్పష్టం చేశారు. పెరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు, ఇంటెలిజెన్స్ నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి, వివిఐపీలు, అధికారులు, ప్రజల కోసం వేర్వేరు పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పెరేడ్ గ్రౌండ్‌కు అనుసంధానంగా ఉన్న ప్రధాన, అంతర్గత రహదారులను తక్షణమే మరమ్మతులు పూర్తి చేయాలని సీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. కార్యక్రమం సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ అధికారులకు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలను మెరుగుపరచాలని జెడ్పీ, డీఆర్‌డీఏ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైద్య శిబిరాలు, అంబులెన్సులు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సూచించారు.

సమీక్షా సమావేశంలో సీఆర్‌డీఏ కమిషనర్ కటమనేని విజయరామరాజు, అదనపు కమిషనర్ భార్గవ తేజ, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ చేకూరి మయూర్ అశోక్, అడిషనల్ ఎస్పీ ఎ.టి.వి. రవికుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని శ్యామలరావు పిలుపునిచ్చారు.

# 7 నుంచి ధృతి బి2 ఎక్స్‌పో-2026



○ 140 స్టాల్స్‌తో మూడు రోజుల మహా వ్యాపార ప్రదర్శన

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ) :** గుంటూరు నగరంలో ఆగస్టు 7, 8, 9 తేదీల్లో అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో నిర్వహించనున్న ధృతి బి2 ఎక్స్‌పో--2026కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ మహా వ్యాపార ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 140 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు, వినియోగదారులు ఒకే వేదికపై కలుసుకునే అవకాశాన్ని ఈ ఎక్స్‌పో కల్పిస్తుందని పేర్కొన్నారు.

ఎక్స్‌పో అధ్యక్షుడు కె. శ్రీధర్ బాబు మాట్లాడుతూ గృహోపకరణాలు, ఫర్నిచర్, సోలార్, రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగం, విద్యా సంస్థలు, సహజ ఉత్పత్తులు, హెల్త్‌కేర్, ఆటోమొబైల్స్, లైఫ్‌స్టైల్, ఫైనాన్స్, టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన 140 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రారంభంలో 70 స్టాల్స్‌తో ప్రణాళిక రూపొందించినప్పటికీ, వ్యాపారవేత్తల నుంచి విశేష స్పందన రావడంతో స్టాల్స్ సంఖ్యను 140కు పెంచినట్లు నిర్వాహకులు వెల్లడించారు.

వ్యాపార విస్తరణ, బ్రాండ్ ప్రచారం, మార్కెటింగ్, కొత్త భాగస్వామ్యాలు, వినియోగదారులతో ప్రత్యక్ష అనుసంధానానికి ఈ ఎక్స్‌పో ఉత్తమ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఎక్స్‌పో కార్యదర్శి బి. హేమంత్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్‌తో పాటు వివిధ రకాల ఉచిత రక్త పరీక్షలు, ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఎక్స్‌పోకు ప్రవేశం పూర్తిగా ఉచితమని, ప్రజలు, వ్యాపారవేత్తలు, విద్యార్థులు, యువత, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా కో-కన్వీనర్లు బద్రి, రమణమూర్తి, నిర్వాహక కమిటీ సభ్యులు చైతన్య, వంశీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# సివిల్ అసిస్టెంట్ సర్జన్ల సవరించిన తాత్కాలిక సీనియారిటీ జాబితా విడుదల

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ పరిధిలో పనిచేస్తున్న సివిల్ అసిస్టెంట్ సర్జన్ల సవరించిన తాత్కాలిక (ఫైనల్ ప్రొవిజనల్) సీనియారిటీ జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు డైరెక్టరేట్ ప్రకటించింది. ఎంపిక సంవత్సరం, మెరిట్ సంఖ్య ఆధారంగా ఈ జాబితాను రూపొందించినట్లు తెలిపింది.

ఇంతకుముందు విడుదల చేసిన తాత్కాలిక సీనియారిటీ జాబితాపై జూలై 13 నుంచి 16 వరకు అభ్యంతరాలు స్వీకరించగా, వైద్యుల సంఘాల విజ్ఞప్తి మేరకు గడువును జూలై 18 వరకు పొడిగించారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ఎంపిక సంవత్సరం, మెరిట్ సంఖ్య ఆధారంగా సవరించిన తాత్కాలిక జాబితాను సిద్ధం చేసి aphmfw.ap.gov.inఅధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

ఈ జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని ఆగస్టు 5 నుంచి ఆగస్టు 7 సాయంత్రం 5 గంటలలోపు e6sectionappealdphfw@gmail.com ఈ-మెయిల్‌కు పంపాలని డైరెక్టరేట్ సూచించింది. అభ్యంతరాలు కేవలం ఎంపిక సంవత్సరం, మెరిట్ ర్యాంకు లేదా మెరిట్ సంఖ్యకు సంబంధించినవిగా మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది. గడువు ముగిసిన తర్వాత వచ్చే అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబోమని, ఆగస్టు 7లోపు అందిన అభ్యంతరాల పరిశీలన అనంతరం సివిల్ అసిస్టెంట్ సర్జన్ల తుది సీనియారిటీ జాబితా విడుదల చేస్తామని వెల్లడించింది. నిర్ణీత గడువులో అభ్యంతరాలు సమర్పించని వారు తర్వాత చేసే వినతులను పరిగణనలోకి తీసుకోబోమని డైరెక్టరేట్ స్పష్టం చేసింది.

# పొగాకు రైతుల సంక్షేమంపై జగన్‌కు బహిరంగ సవాల్

○ వాస్తవాలు, గణాంకాలతో చర్చకు రావాలి : మంత్రి అచ్చెన్నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పొగాకు రైతుల సంక్షేమంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. విజయవాడలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రైతులపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌కు సవాల్ విసిరారు. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ టీడీపీ ప్రభుత్వాలే అండగా నిలిచాయని, గత ఏడాది బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి సుమారు రూ.280 కోట్లు వెచ్చించామని తెలిపారు.

2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సాయం అందించినట్లు గుర్తుచేసిన మంత్రి, వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019, 2020లో ధరలు తగ్గినా రైతులకు తగిన మద్దతు లభించలేదన్నారు. 2019లో ఉత్పత్తి అయిన 124 మిలియన్ కిలోల పొగాకులో కేవలం 11.8 మిలియన్ కిలోలనే కొనుగోలు చేశారని, 2020లో 128 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినప్పటికీ ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. 2024లో పొగాకు ధర కిలోకు రూ.326కు చేరిందని, 2025లో రూ.300, 2026లో రూ.275గా నమోదైందని పేర్కొన్నారు.

ప్రస్తుత ఏడాది టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు 241 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేశారని అచ్చెన్నాయుడు తెలిపారు. అధిక ఉత్పత్తితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు కిలోకు రూ.10 చొప్పున రూ.100 కోట్ల ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ పంపిణీని వెంటనే ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. అవసరమైతే అదనపు ఉత్పత్తికీ ఇదే విధంగా సాయం అందిస్తామని, కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50 వేల వడ్డీలేని రుణం కూడా అందిస్తోందని తెలిపారు. రైతుల కోసం ఎవరు పనిచేశారో, ఎవరు విస్మరించారో ప్రజలే నిర్ణయిస్తారని మంత్రి అన్నారు..

# డిజిటల్ యుగంలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం

○ హైదరాబాద్‌లో ఎన్‌సీడీపీఎంపీ--2026 జాతీయ సదస్సు



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** డిజిటల్ సాంకేతికత మనిషి శ్రేయస్సుకు ఉపయోగపడాలే తప్ప ఒత్తిడికి కారణం కాకూడదనే సందేశంతో హైదరాబాద్‌లో మానసిక ఆరోగ్య నిపుణులు సమావేశమయ్యారు. డెక్కన్ పాజిటివ్ మెంటల్ హెల్త్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్ర మహిళా సభ కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్‌లో నిర్వహించిన రెండో వార్షిక జాతీయ సదస్సు ఎన్‌సీడీపీఎంపీ--2026లో దేశవ్యాప్తంగా మనోవిజ్ఞాన నిపుణులు, మానసిక వైద్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. "డిజిటల్ యుగంలో మానసిక ఆరోగ్యం" అనే ప్రధాన అంశంపై నిర్వహించిన ఈ సదస్సులో డిజిటల్ శ్రేయస్సు, భావోద్వేగ ఆరోగ్యం, పని--వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యత, బాధ్యతాయుత సాంకేతిక వినియోగంపై విస్తృతంగా చర్చించారు.

సదస్సుకు అధ్యక్షత వహించిన డీపీఎంపీ అధ్యక్షురాలు సునంద రవి మాట్లాడుతూ సాంకేతికతను అవగాహనతో వినియోగించాలని, నిరంతరం స్క్రీన్‌లకు పరిమితం కాకుండా ప్రకృతితో, ఇంద్రియాలతో అనుసంధానం కావాలని సూచించారు. అధిక డిజిటల్ వినియోగం వల్ల కలిగే ఒత్తిడిని తగ్గించేందుకు 5-4-3-2-1 గ్రౌండింగ్ టెక్నిక్ ఉపయోగకరమని వివరించారు. డీపీఎంపీ కార్యదర్శి పి. దినకరరావు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో పది మంది సభ్యులతో ప్రారంభమైన సంఘం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు నాలుగు వేల మంది మనోవిజ్ఞాన నిపుణులతో విస్తరించిందని, 15 దేశాలతో అనుబంధాలు ఏర్పరుచుకుని ఉచిత మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమానికి పేరిణి నాట్య ప్రదర్శన ఆకర్షణగా నిలిచింది.

సదస్సులో బ్రహ్మకుమారీస్ ఎడ్యుకేషన్ వింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.కె. పాండ్యమణి యువత డిజిటల్ ఉచ్చుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత సాంకేతిక వినియోగం అలవర్చుకోవాలని సూచించారు. యూ అండ్ మీ కౌన్సెలింగ్ సెంటర్ వ్యవస్థాపకుడు డాక్టర్ సి. వీరేందర్ చెన్నోజు భావోద్వేగ ఒత్తిడి శారీరక సమస్యలుగా మారే ప్రమాదాన్ని వివరిస్తూ, మానసిక ఆరోగ్య నిపుణుల సహాయం కోరడం బలహీనత కాదని స్పష్టం చేశారు. డాక్టర్ నేహా గాలా, డాక్టర్ జి. సాకేత్ రెడ్డి, డాక్టర్ చింతపేట రవి, అమెరికాకు చెందిన మ్యాట్ పెరెల్‌స్టీన్ తదితర నిపుణులు డిజిటల్ వినియోగం, భావోద్వేగ మేధస్సు, న్యూట్రిషనల్ సైకియాట్రీ, భారతీయ జ్ఞాన వ్యవస్థలు వంటి అంశాలపై ప్రసంగించారు.

సదస్సులో కుటుంబాలు, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మానసిక ఆరోగ్యంపై మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని నిపుణులు నొక్కిచెప్పారు.

డిజిటల్ ప్రపంచంలోనూ మానవ అనుబంధం, సహానుభూతి, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మానసిక ఆరోగ్య చర్చలను సమాజంలోని ప్రతి స్థాయికి తీసుకెళ్లడం ద్వారానే ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని సదస్సు తీర్మానించింది.

# కూటమి ప్రభుత్వంలోనే వరాహపురం అభివృద్ధి : ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్) :** "2 ఏళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం" ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా వేమూరు మండలం వరాహపురం గ్రామంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్ బాబు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ, వారి సమస్యలు, సూచనలను తెలుసుకుని మైటీడీపీ యాప్ ద్వారా నమోదు చేశారు. ప్రతి గ్రామంలో ఇదే తరహా కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి కుటుంబాన్ని సందర్శించాలని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్-యూనిట్-బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా వరాహపురం గ్రామంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఎమ్మెల్యే వెల్లడించారు. 1,845 మంది జనాభా, 680 కుటుంబాలు ఉన్న గ్రామంలో తల్లికి వందనం, దీపం-2, అన్నదాత సుఖీభవ, ఎన్టీఆర్ భరోసా, మహిళా శక్తి, డ్వాక్రా తోడు, పీఎం కిసాన్, ఎన్టీఆర్ వైద్య సేవ, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, సీఎంఆర్ఎఫ్ వంటి పథకాల ద్వారా మొత్తం రూ.3.58 కోట్ల మేర ప్రయోజనాలు అందాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఆర్థిక సాయం, సామాజిక పెన్షన్లు, ఉచిత వైద్య సేవలు వంటి పథకాలు గ్రామ ప్రజలకు ఉపయోగపడుతున్నాయని చెప్పారు.

గ్రామాభివృద్ధిలో భాగంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిందని, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూ.36 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. అలాగే 29 గృహాల నిర్మాణానికి రూ.72.50 లక్షలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గ్రామంలో 2.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.15 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 1.5 కిలోమీటర్ల డ్రైనేజీ, ఓవర్‌హెడ్ తాగునీటి ట్యాంకు, 145 వీధి దీపాలు, మూడు పాఠశాలలు, మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

ప్రజల సంక్షేమం, గ్రామాల సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నక్కా ఆనంద్ బాబు అన్నారు. "స్వర్ణాంధ్ర-విజన్ 2047" లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కల్పన, సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం, అమరావతి అభివృద్ధి, రహదారుల నిర్మాణం వంటి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందన్నారు. ప్రజల ఆశీస్సులతో వరాహపురం గ్రామానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హిందూ మతంపై విద్వేష ప్రచారం... బీజేపీ ఆగ్రహం

○ హిందూ దేవతలపై అసభ్య పోస్టులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

○ సైబర్ సెక్యూరిటీ డీజీపీకి బీజేపీ నాయకుల ఫిర్యాదు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సోషల్ మీడియా వేదికగా హిందూ దేవతలు, హిందూ ధర్మం, హిందూ సంప్రదాయాలపై అభ్యంతరకర, అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుల బృందం రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ డీజీపీ రవిశంకర్ అయ్యానార్‌ను కలిసి ఫిర్యాదు చేసింది. ఈ బృందంలో టీటీడీ బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ, పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస రాజు, షేక్ బాజీ, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు సునీల్ రెడ్డి, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ పేరుతో కొందరు వ్యక్తులు కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవాలు, హిందూ ధర్మం, పవిత్ర సంప్రదాయాలను అత్యంత నీచమైన భాషలో అవమానిస్తూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలు మత విద్వేషాలను రెచ్చగొట్టేలా ఉన్నాయని పేర్కొంటూ వాటిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను ఇతరుల మత విశ్వాసాలను కించపరచడానికి లేదా ప్రజల మనోభావాలను దెబ్బతీయడానికి వినియోగించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు.

గతంలో నటుడు ప్రకాష్ రాజ్ హిందూ దేవతలపై చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన తప్పుబట్టారు. వ్యక్తిగత ప్రచారం కోసం లేదా చౌకబారు గుర్తింపు కోసం హిందూ దేవతలను అవమానించడం అంగీకారయోగ్యం కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో హిందూ దేవతలు, హిందూ ధర్మంపై అసభ్య వ్యాఖ్యలు చేసే వారిని ప్రజలు సహించరని హెచ్చరించారు.

హిందూ ధర్మంపై నిరంతరం ద్వేషప్రచారం చేస్తున్న సోషల్ మీడియా ఖాతాల వెనుక ఉన్న నిధుల మూలాలు, వారికి ఆర్థిక సహాయం చేస్తున్న వ్యక్తులు లేదా సంస్థలు, విదేశీ నిధులు లేదా ఇతర అనుమానాస్పద వనరులు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని బీజేపీ నాయకులు డీజీపీని కోరారు. అలాంటి ఖాతాలను గుర్తించి వెంటనే బ్లాక్ చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదును స్వీకరించిన సైబర్ సెక్యూరిటీ డీజీపీ రవిశంకర్ అయ్యనార్ స్పందిస్తూ, రాష్ట్రంలో ఉన్నా, రాష్ట్రం వెలుపల ఉన్నా చట్ట పరిధిలోకి వచ్చే ప్రతి ఒక్కరిని గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వల్లూరు జయప్రకాశ్ నారాయణ తెలిపారు.

ఈ దేశంలో ప్రతి మతాన్ని గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని, అదే సమయంలో ఏ మతాన్నైనా, ముఖ్యంగా హిందూ దేవతలు, హిందూ ధర్మాన్ని లక్ష్యంగా చేసుకుని ద్వేషాన్ని రెచ్చగొట్టే వారిని దేశ ప్రజలు ఎన్నటికీ క్షమించరని వల్లూరు జయప్రకాశ్ నారాయణ అన్నారు. అలాంటి వారి విషయంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తరఫున మరోసారి డిమాండ్ చేశారు.

# చేనేత భారతీయ సంస్కృతికి ప్రతీక...నేతన్నల సంక్షేమమే బీజేపీ లక్ష్యం

○ ప్రపంచ చేనేత దినోత్సవానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావాలి

○ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్






**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, స్వదేశీ స్ఫూర్తికి చేనేతే శాశ్వత ప్రతీక అని, నేతన్నల సంక్షేమం, చేనేత రంగ పునరుద్ధరణకు భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ప్రపంచ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి చేనేత సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాఘవయ్య పార్కు నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు నేతన్నలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. భారతదేశాన్ని ఒకప్పుడు "బంగారు పిచుక"గా ప్రపంచం కొనియాడడానికి భారతీయ చేనేత ఉత్పత్తులే ప్రధాన కారణమని మాధవ్ అన్నారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది భారతీయ సంస్కృతి, కళాత్మకత, శ్రమ, స్వదేశీ ఆత్మకు ప్రతీక అని పేర్కొన్నారు. బ్రిటిష్ పాలనలో చేనేత రంగాన్ని దెబ్బతీసేందుకు నేతన్నలపై తీవ్ర ఆంక్షలు విధించినా భారతీయ చేనేత స్ఫూర్తిని అణచలేకపోయారని గుర్తు చేశారు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమం చేనేతకు కొత్త ఊపు తీసుకువచ్చిందని, మహాత్మా గాంధీ చరఖాను స్వాతంత్ర్య ఉద్యమానికి చిహ్నంగా మార్చారని చెప్పారు. ఆగస్టు 7ను ప్రపంచ చేనేత దినోత్సవంగా గుర్తించేలా అంతర్జాతీయ స్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ధర్మవరం పట్టు చీరలు, పొందూరు ఖాదీ, పోచంపల్లి ఇక్కత్, వెంకటగిరి, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, బొబ్బిలి చేనేత ఉత్పత్తులు ప్రపంచవ్యాప్తంగా భారతీయ కళా వైభవాన్ని చాటుతున్నాయని మాధవ్ పేర్కొన్నారు. చేనేత రంగంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, పత్తి నుంచి వస్త్రం తయారీ వరకు ప్రతి దశలో వారి కృషి ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ముద్ర రుణాలు, బున్కర్ సంక్షేమ పథకాలు, మార్కెటింగ్, డిజిటల్ వేదికల ద్వారా నేతన్నలకు కొత్త అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కూడా చేనేత కుటుంబాలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ధర్మవరంలో ఏర్పాటు చేస్తున్న దక్షిణ భారతదేశ తొలి మెగా హ్యాండ్లూమ్ క్లస్టర్ చేనేత రంగ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతుల సునీత మాట్లాడుతూ చేనేత దేశంలోనే అతిపెద్ద ఉపాధి రంగాల్లో ఒకటని, స్వదేశీ ఉద్యమానికి చేనేతే నాంది పలికిందన్నారు. చీరాల ప్రాంత చేనేత కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు పత్తి రైతులకు మరింత ప్రోత్సాహం అందించాలని కోరారు. పవర్‌లూమ్ పోటీని తట్టుకుని నిలబడేందుకు చేనేత రంగానికి ప్రత్యేక రక్షణ, మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలని సూచించారు. ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకుని నేతన్నలు ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు.

బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బిట్రా శ్రీమన్నారాయణ, వావిలాల సరళాదేవి, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, నాగోతు రమేష్ నాయుడు, గుడిసె దేవానంద్, జగ్గరపు శ్రీనివాసరావు, చల్లపల్లి శ్రీనివాసరావు, వీరాంజనేయ ప్రసాద్, కన్నా మాస్టర్, పనతల సురేష్, సయ్యద్ బాషా, యామినీ శర్మతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467